'అష్ట' సూత్రాలతో క్యాన్సర్‌కు చెక్
ముందు జాగ్రత్తలతో ప్రతి ఇద్దరిలో ఒకరిని కాపాడొచ్చు
అమెరికన్ క్యాన్సర్ సొసైటీ సూచనలు > 7



నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
NAMASTE TELANGANA

నిపుణ
పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శనివారం SATURDAY 13.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 38 | వెల (Price) రూ.6.50 | సప్తమి

శనివారం, సూర్యోదయం: 5-49, సూర్యాస్తమయం: 6-54. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ రుతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: సప్తమి పగలు 3-07 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం: హస్త రాత్రి 7-14 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 4-12 నుంచి తెల్లవారుజాము 5-58 వరకు. రాహుకాలం: ఉదయం 9-06 నుంచి ఉదయం 10-42 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-49 నుంచి ఉదయం 7-34 వరకు. అమృతకాలం: పగలు 12-28 నుంచి పగలు 2-12 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline



మైనర్‌పై పోలీసుల కాల్పులు
నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద అర్ధరాత్రి డెకాయిట్ ఆపరేషన్
బాలుడి తొడపై బుల్లెట్ గాయం.. మరొకరు అరెస్టు > 5

రాజ్యాంగ హత్యాదినంగా జూన్ 25 > 7
ఎమర్జెన్సీకి గుర్తుగా ఏటా నిర్వహణ
కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్

గుదిబండల్లా గ్యారెంటీలు!
నిధులన్నీ వాటికే ఖర్చవుతున్నాయి
అభివృద్ధికి కేటాయింపుల్లేవు
కర్ణాటక సీఎం సలహాదారు రాయరెడ్డి వ్యాఖ్యలు > 7

ఎలుకల కలకలం
- మరో నలుగురు గురుకుల విద్యార్థులను కరిచిన మూషికాలు
- రామాయంపేట ఘటన మరువకముందే నర్సాపూర్‌లో రిపీట్
- గుట్టుచప్పుడు కాకుండా చికిత్స చేయించిన గురుకుల సిబ్బంది

నర్సాపూర్, జూలై 12: గురుకులాల్లో ఎలుకలు విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి, పగలూ తేడా లేకుండా గదుల్లోకి వచ్చి విద్యార్థులను కొరుకుతున్నాయి. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. గురువారం మెదక్ జిల్లా రామాయంపేటలోని గురుకుల హాస్టల్‌లో విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటన మరువక ముందే.. శుక్రవారం > 6వ పేజీలో

నేతన్న ఆత్మహత్య


ఉపాధి లేక.. అప్పుల భారం మోయలేక..
ఉరేసుకున్న మగ్గం కార్మికుడు శంకరయ్య

కట్టంగూర్, జూలై 12 : ఉపాధి కరువై.. అప్పులు భారమై ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామానికి చెందిన ఏలె శంకరయ్య (47) మొదట నల్లగొండలో చేనేత కార్మికుడిగా పని చేస్తూ మూడేండ్ల క్రితం బతుకుదెరువు కోసం కట్టంగూర్ వచ్చారు. ఇందిరమ్మ కాలనీలో ఇల్లు కట్టుకొని అప్పు చేసి సొంతంగా పవర్ లూమ్ (సాంచాలు) ఏర్పాటు చేసుకున్నాడు. భార్య నర్సమ్మతో కలిసి మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారికి ఇద్దరు > 2వ పేజీలో

రైతన్నల బలవన్మరణం


సభావత్ రమేశ్ (ఫైల్) లక్ష్మయ్య (ఫైల్)

ఓ వైపు వర్షాభావ పరిస్థితి..
మరోవైపు అప్పుల భారం
ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

చందంపేట/పాలకుర్తి, జూలై 12 : వర్షాభావ పరిస్థితులకు తోడు అప్పుల భారం పెరగడంతో మనస్తాపం చెంది ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు నల్లగొండ, జనగామ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన సభావత్ రమేశ్ (30) తనకున్న ఎకరంతోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల వర్షాభావ పరిస్థితులతో పత్తి > 2వ పేజీలో

డీఎస్సీ పరేషాన్!
తప్పులతడకగా హాల్ టికెట్లు.. తలపట్టుకుంటున్న అభ్యర్థులు
- ఒక పరీక్ష నిజామాబాద్‌లో.. మరొకటి మేడ్చల్‌లో..
- ఒకే అభ్యర్థికి ఒకే రోజు వేర్వేరు జిల్లాల్లో పరీక్షలు
- రెండు పరీక్ష కేంద్రాల మధ్య 150 కి.మీ దూరం
- గందరగోళంగా నిర్వహణ.. అభ్యర్థుల్లో ఆందోళన



డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్లను అస్సలే పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం ఆదిలోనే తన వైఫల్యాన్ని బయటపెట్టుకున్నది. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణకు ముందుకొచ్చిన సర్కారు.. పరీక్ష నిర్వహణలో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించలేకపోయింది. హాల్‌టికెట్లలో తప్పులు దొర్లడం, ఒకే అభ్యర్థికి ఒకేరోజు దూరంగా ఉన్న వేర్వేరు కేంద్రాలను కేటాయించడంపై అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మొదట్లోనే ఇలాంటి తప్పులు జరిగితే ఆన్‌లైన్ పరీక్షల్లో, ఉద్యోగాల భర్తీ విషయంలో ఎలాంటి తప్పులు దొర్లుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు.

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఎక్కడి నిజామాబాద్.. ఎక్కడి మేడ్చల్.. దాదాపు 150 కిలోమీటర్లకు పైగా దూరం. 3 గంటలకు పైగా ప్రయాణం. ఆ అభ్యర్థి నివాసం ఉండేది కామారెడ్డి. ఒకేరోజు ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు మేడ్చల్‌లో ఒక పరీక్ష. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మరో పరీక్ష. ఉదయం పరీక్ష ముగించుకున్న వ్యక్తి మధ్యాహ్నం రెండు గంటల కల్లా 150 కిలోమీటర్లకు పైగా ప్రయాణించగలడా? పరీక్ష రాయగలడా? ఎలా సాధ్యం. మరో మహిళా అభ్యర్థికి ఉదయం మేడ్చల్‌లో, మధ్యాహ్నం మహబూబ్‌నగర్‌లో పరీక్ష ఉన్నది. ఈ రెండింటి మధ్య సుమారు 150 కిలోమీటర్ల దూరం. ఇవేమీ చూడకుండా పాఠశాల విద్యాశాఖ అధికారులు డీఎస్సీ పరీక్ష కేంద్రాలను > 2వ పేజీలో



శుక్రవారం కొడంగల్‌లోని 'కడా' కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, రైతులు

భూములివ్వం!
- మెడికల్ కాలేజీకోసం మమ్మల్ని రోడ్డున పడేస్తరా?
- అభివృద్ధి ముసుగులో అన్నదాతల కడుపుకొట్టొద్దు
- కొడంగల్‌లో రైతుల తిరుగుబాటు.. 'కడా' ముట్టడి
- 2013 భూసేకరణ చట్టం వర్తింపజేయాలని డిమాండ్

కొడంగల్, జూలై 12: 'మెడికల్ కాలేజీ కోసం మా బతుకులను రోడ్డున పడేస్తరా? ఎండ్ల నుంచి సాగుచేసుకుంటున్న భూములను అభివృద్ధి ముసుగులో గుంజుకుంటమంటే ఎట్ల? ఎప్పటిస్నీ నమ్ముకొని బతుకుతున్న మా పొట్టకొట్టొద్దు.. ఈ భూములను ఇచ్చేది లేదు' అని ప్రభుత్వంపై రైతులు తిరగబడ్డారు. ప్రజాసంఘాల నాయకులతో కలిసి వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని 'కడా' కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు > 2వ పేజీలో

బ్రాహ్మణ సంక్షేమం అగమ్యగోచరం


- బ్రాహ్మణ పరిషత్తు ఉన్నట్టా? లేనట్టా?
- కేసీఆర్ హయాంలో ఏటా 100కోట్లు
- ఆ పథకాలనూ ఇప్పుడు నిలిపివేశారు
- పేద కుటుంబాల్లో చీకట్లు నింపొద్దు
- ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలె
- రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ సర్కార్ బ్రాహ్మణ పరిషత్తు ద్వారా అమలు చేసిన కార్యక్రమాలు దేనికదే అర్ధాంతరంగా నిలిచాయని, వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించటంతో సంక్షేమ పరిషత్తు ద్వారా అమలు చేసే పథకాలు నిలిచిపోయాయని తెలిపారు. ఈ విషయంలో సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేద > 5వ పేజీలో

చేరిన చోటే పాతుకుపోయారు!
దశాబ్దాలుగా ఒకేచోట డాక్టర్లు, బోధన సిబ్బంది తిష్ట
దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారి జాబితా విడుదల > 5

అనధికారికంగా అర్చక బదిలీలు!
ఎండోమెంట్ యాక్ట్‌కు దేవాదాయ శాఖ తూట్లు
బలవంతంగా అర్చన్నట్లు జరుగుతున్న అధికారులు
బదిలీలు ఆపకపోతే ఉద్యమం: సంఘాలు > 5

దావత్‌లో లిక్కర్‌పై ఎక్సైజ్ నజర్

ఎన్డీపీఎల్ కోసం సరిహద్దుల్లో డ్రైవ్‌లు • 4 నెలల్లో 302 కేసులు

అక్రమ మద్యం తెస్తే చర్యలు • ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెచ్చరిక



ఓ ప్రైవేట్‌పార్టీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్‌అధికారులు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): దావత్‌లో 'సిట్టింగ్' వేయాలంటే ఇక తప్పనిసరిగా ఎక్సైజ్‌శాఖ అనుమతి తీసుకోవాల్సిందే! అక్కడ ఎవరైనా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) కనిపిస్తే ఉపేక్షించేది లేదని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం హెచ్చరించింది. విదేశాల నుంచో, ఇతర రాష్ర్టాల నుంచో మద్యం అక్రమంగా తెచ్చి ఫంక్షన్లు చేసినా, ప్రైవేట్ పార్టీలు పెట్టుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు పెరుగుతుండటంతో ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడ ఫంక్షన్లు, పార్టీలు జరిగినా అక్కడ 'సిట్టింగ్' ఆప్షన్ ఉంటే తప్పనిసరిగా మఫ్టీలో నిఘా పెట్టాలని ఆదేశించారు. ఇతర రాష్ర్టాల నుంచి వచ్చే కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, 100 నుంచి 200 మంది అప్లై హాజరయ్యే ప్రతి ఫంక్షన్‌లోనూ తప్పనిసరిగా నిఘా పెట్టాలని సూచించారు.

సిట్టింగ్‌కు పర్మిషన్ తీసుకోవాలి




ఫంక్షన్లలో మద్యం సిట్టింగ్ కావాలంటే పర్మిషన్ తీసుకోవాలి. ఎక్కన్నుంచో మద్యం దొంగచాటుగా తీసుకొస్తే ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఏడు ఏప్రిల్ వరకు 302 కేసులు నమోదు చేశాం. 165 మందిని అదుపులోకి తీసుకున్నాం. 95 వాహనాలు సీజ్ చేసి, 61.13 లక్షల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశాం. ఇకనుంచి స్పెషల్ డ్రైవ్‌లపై దృష్టిపెట్టాలి. లేకపోతే అధికారులపై చర్యలు తప్పవు.

- వీబీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

మద్యం మత్తు ఖరీదు 3,321 కోట్లు

- లిక్కర్ అమ్మకాల్లో రికార్డు దిశగా తెలంగాణ
- వాణిజ్య, సేల్స్ ట్యాక్స్ తరువాత ఆబ్కారీదే హవా
- తాజాగా వెల్లడించిన కాగ్ నివేదిక

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఖజానాను నింపుకోవడానికి రాష్ట్ర ప్రజలను మత్తులో ముంచుతున్నది. మద్యం అమ్మకాల ద్వారా గత ఏడాది కన్నా రూ.11 వేల కోట్లు అధికంగా.. ఈ ఏడాది రూ.45 వేల కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్ సర్కార్.. ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. ఇందుకు తాజాగా కాగ్ వెల్లడించిన గణాంకాలు అద్దం పడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 తొలి నెల ఏప్రిల్‌లో రాష్ర్టానికి మద్యం అమ్మకాల ద్వారా రూ.1,580 కోట్లు, మేలో రూ.3,321 కోట్లు వచ్చినట్టు కాగ్ రిపోర్టు వెల్లడించింది. జూన్‌లో రూ.1,342 కోట్ల ఆదాయం వచ్చినట్టు సమాచారం. మద్యం అమ్మకాల నుంచి ఎక్సైజ్‌శాఖకు ప్రతినెలా సుమారు రూ.3 వేల కోట్ల వరకు ఆదాయం వస్తున్నది. ఆరు నెలల్లోనే రూ.23 వేల కోట్ల ఆదాయం సమకూరినట్టు తెలిసింది.



లోకం పోకడ



ఈ రోజు మీకు ఘుమఘుమలాడే లంచ్ మన ప్రభుత్వ హాస్టల్ నుంచి తెప్పించాం సార్!



కంప్యూటర్ పరీక్షలో పాసైతేనే డ్రైవింగ్ లైసెన్స్

కొత్తగా ఆటోమెటిక్ పద్ధతిలో పరీక్ష • అడ్డదారుల్లో లైసెన్స్ పొందేవారికి చెక్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): డ్రైవింగ్ లైసెన్సుల జారీలో అక్రమాలకు, అడ్డదారిలో లైసెన్సులు పొందేవారికి చెక్ పెట్టేందుకు ఆర్టీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియను ఆధునీకరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం మాన్యువల్ పద్ధతిలో కొనసాగుతున్న పరీక్షను తొలగించి, మరింత ప్రామాణికమైన ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇకపై లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. రహదారులపై నిత్యం ఎదురయ్యే సమస్యలను కొత్త పద్ధతిలో టెస్ట్ ట్రాక్‌పై కృత్రిమంగా కల్పిస్తారు. పరీక్షలో భాగంగా ఆ ట్రాక్‌పై వాహనం నడిపినప్పుడు కంప్యూటర్‌లో రికార్డు అవుతుంది. దీంతో సక్రమంగా వాహనం నడిపినవారికే లైసెన్సు లభిస్తుంది. డ్రైవింగ్‌లో ఏ చిన్న తప్పు చేసినా పరీక్షలో ఫెయిల్ అయినట్టే.

లైసెన్స్ జారీకి కొత్త పద్ధతులు ఇవీ..

- ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్‌లో 8 ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు.
- ముందుగా 'హెచ్' ట్రాక్‌లో వాహనాన్ని రివర్స్ చేయాల్సి ఉంటుంది.
- ఆ తర్వాత 'ఎస్' ట్రాక్‌లో వాహనాన్ని ఒక మూల నుంచి మరో మూలకు టర్న్ చేయాలి.
- చివరగా మలుపులు, ఎత్తుపల్లాలు, గతుకులతో ఉండే 'కే' ట్రాక్‌లో వాహనాన్ని నడిపి, సక్రమంగా పార్క్ చేసిచూపాలి.
- ట్రాఫిక్ నిబంధనల ప్రకారం టూవీలర్ డ్రైవర్ హెల్మెట్, ఫోర్‌వీలర్ డ్రైవర్ సీటుబెల్ట్ పెట్టుకోవాలి. ఈ ప్రక్రియ అంతా కంప్యూటర్‌లో రికార్డవుతుంది.
- వాహనాన్ని నడిపేటప్పుడు ఎలాంటి పొరపాట్లు చేసినా టెస్ట్‌లో ఫెయిల్ అయినట్టు కంప్యూటర్‌లో చూపిస్తుంది.
- పరీక్షలో ఫెయిలైన వారికి మరో నెల రోజులు శిక్షణ తీసుకుని మళ్లీ టెస్టుకు రమ్మంటారు.

రాష్ట్రంలో డెంగ్యూ విజృంభణ

- ఆరున్నర నెలల్లోనే 1078 కేసులు
- గతేడాదితో పోల్చితే 52 % పెరుగుదల
- డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించినా పట్టని ప్రభుత్వం
- దోమల నివారణపై దృష్టిపెట్టని యంత్రాంగం
- గ్రామాలు, పట్టణాల్లో పడకేసిన పారిశుధ్యం



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డెంగ్యూ విజృంభిస్తున్నది. ఏడు నెలల్లోనే కేసుల సంఖ్య వెయ్యి దాటింది. డెంగ్యూని నియంత్రించాలంటే దోమల నివారణ చర్యలతోపాటు ట్రాకింగ్, టెస్టింగ్, ట్రీటింగ్ కోసం దవాఖానల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యంపైగానీ, దోమల నివారణపైగానీ, వైద్యారోగ్యశాఖ దవాఖానల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 'దోమల నివారణకు చర్యలు తీసుకోండి' అంటూ హడావుడి సమీక్షలు, ఆదేశాలు, ప్రకటనలే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో డెంగ్యూ కేసులు పెరుగుతాయని స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల హెచ్చరిక జారీ చేసింది. డెంగ్యూలోని నాలుగు ప్రధాన వేరియంట్లు డీఈఎన్వీ-1, డీఈఎన్వీ-2, డీఈఎన్వీ-3, డీఈఎన్వీ-4 రాష్ట్రంలో కనిపిస్తున్నాయని పేర్కొన్నది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించినా తగిన చర్యలు తీసుకోకపోవడంతో డెంగ్యూ కేసులు భారీగా నమోదవుతున్నాయి.

సగంకన్నా ఎక్కువ..

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలో 1078 డెంగ్యూ కేసులు నమోదైనట్టు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇవి అధికారికంగా చెప్పిన లెక్కలు మాత్రమే. అనేక ప్రైవేట్ దవాఖానలు డెంగ్యూ కేసులను రిపోర్ట్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు 706 కేసులు నమోదైనట్టు గణాంకాలు చెప్తున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ సారి 52 శాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. రాష్ట్రంలో మలేరియా కూడా విజృంభిస్తున్నది. ఈ ఏడాది ఇప్పటివరకు 78 మలేరియా కేసులు నమోదయ్యాయి.

పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య లోపం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలకు ప్రతి నెల నిధులు విడుదల చేయలేదు. ఏడు నెలల్లోనే దాదాపు రూ.3వేల కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్టు చెప్తున్నారు. పల్లెల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనలేని పరిస్థితి నెలకొన్నదనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య లోపంతో దోమలు పెరిగిపోతున్నాయని చెప్తున్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో గోళీల్లేవ్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కారు వచ్చిన ఆరునెలల్లోనే ప్రభుత్వ దవాఖానాల్లో మందు గోళీలు కూడా దొరకని దుస్థితి వచ్చిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు అన్నారు. పాలన గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. సర్కారు వైద్యానికి కేసీఆర్ ప్రభుత్వం జవసత్వాలు ఇచ్చి, పేదలు పదరో సర్కారు దవాఖానాకు అనే ధీమానిచ్చిందని చెప్పారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.3°c	24.7°c
మెదక్	36.2°c	22.9°c
నిజామాబాద్	34.0°c	25.9°c
రంగారెడ్డి	33.7°c	22.2°c
హైదరాబాద్	32.2°c	24.5°c
కరీంనగర్	32.0°c	26.0°c
వరంగల్	31.0°c	24.0°c
నల్లగొండ	30.0°c	22.0°c
ఖమ్మం	30.0°c	25.0°c
మహబూబ్‌నగర్	29.6°c	23.3°c

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం ఖమ్మం జిల్లా వైరాలో అత్యధికంగా 5.04 సెం.మీ వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారడంతో రానున్న రెండు వారాలు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అన్నారం బరాజ్‌లో 75 శాతం పరీక్షలు పూర్తి

జయశంకర్ భూపాలపల్లి, జూలై 12 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో చేపట్టిన టెస్టింగ్ పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఆదేశాల మేరకు సీడబ్ల్యూపీఆర్‌ఎస్ బృందం అన్నారం బరాజ్‌లో 40 రోజులుగా పరీక్షలు నిర్వహిస్తున్నది. వరద తాకిడి పెరగడంతో పరీక్షలకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం అన్నారం బరాజ్ అప్ స్ట్రీమ్‌లో 21 టెస్టులకు గాను 21, డ్రిల్లింగ్, డౌన్ స్ట్రీమ్‌లో 21 టెస్టులకు గాను 8, 11 డ్రిల్లింగ్ పనులు పూర్తయ్యాయి. మొత్తం 75 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. అన్నారం బరాజ్ నుంచి రోజుకు 3 టీఎంసీల నీరు వృథాగా పోతున్నది. కనీసం టీఎంసీ నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా సుందిళ్ల బరాజ్‌కు లిఫ్ట్ చేస్తే రైతులకు కొంత ఉపశమనం కలిగేదని విశ్లేషకులు చెబుతున్నారు. 2021లో అన్నారం, సుందిళ్ల బరాజ్‌లో సీపేజీలు ఏర్పడగా కెమికల్ గ్రౌటింగ్ చేసి రైతులకు సాగునీరు అందించారు. ప్రస్తుతం నీరు లేక రైతులు నార్లు పోసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మేడిగడ్డకు వరద

మహదేవపూర్/కన్నాయిగూడెం, జూలై 12 : మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు శుక్రవారం ఇన్‌ఫ్లో 43,500 క్యూసెక్కుల రాగా, ఎనిమిది బ్లాక్‌లోని 85 గేట్ల ఎత్తి అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతున్నది. శుక్రవారం ఎగువ నుంచి 64,350 క్యూసెక్కుల వరద వచ్చినట్టు అధికారులు తెలిపారు.

నేతన్న ఆత్మహత్య

> మొదటిపేజీ తరువాయి...

కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పవర్ లూమ్ పెట్టుబడుల కోసం, పెద్ద కూతురి పెండ్లి కోసం శంకరయ్య రూ.7 లక్షల వరకు అప్పు చేశాడు. కొంతకాలంగా పనులు లేకపోవడం, ఉపాధి అంతంతమాత్రంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారడం, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి పోతుండటంతో మనస్తాపానికి గురై శుక్రవారం గ్రామ శివారులోని సత్యనారాయణపురం సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకరయ్య కుమారుడు ప్రణీత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఓబులాపూర్ ఎస్సై ఎస్ శ్రీను తెలిపారు.

పాలిటెక్నిక్‌లో మరో 8,748 సీట్లు ఖాళీ

ముగిసిన తుది విడత పాలిసెట్ కౌన్సెలింగ్

మొత్తంగా 70.46% సీట్ల భర్తీ

16 వరకు రిపోర్టింగ్‌కు అవకాశం

18 నుంచి ఫస్టియర్ క్లాసులు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్ తుది విడత కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత మరో 8,748 సీట్లు భర్తీ కాకుండా మిగిలాయి. ప్రైవేట్ కాలేజీలతో పోల్చితే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోనే అత్యధిక సీట్లు భర్తీకావడం విశేషం. ప్రభుత్వ కాలేజీల్లో 13వేలకు సీట్లుంటే 11వేల సీట్లు భర్తీకాగా, ప్రైవేట్ కాలేజీల్లో 15వేల సీట్లుంటే 9వేలకు పైగా సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, ఒక ప్రైవేట్ కాలేజీలో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. పాలిటెక్నిక్ తుది విడత సీట్లను శుక్రవారం కేటాయించగా, రెండు విడతల్లో మొత్తంగా 29, 610సీట్లకు, 20,862 (70.46%) సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన విద్యార్థులు 15లోగా ఫీజు చెల్లించాలని, 16లోగా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. కోర్సుల వారీగా తీసుకుంటే సీఎస్‌ఈలో 82% సీట్లు భర్తీకాగా, ఆ తర్వాత ఈసీఈలో 80% దాకా భర్తీ అయ్యాయి. పాలిటెక్నిక్ ఫస్టియర్ క్లాసులు 18 నుంచి ప్రారంభంకానున్నాయి. 15, 16 తేదీల్లో విద్యార్థులకు ఓరియంటేషన్‌ను నిర్వహించి, 18 నుంచి మొదటి సెమిస్టర్ క్లాసులను ప్రారంభిస్తారు.

కోర్సు	సీట్లు	భర్తీఅయినవి(%)
సీఎస్‌ఈ	6,796	5,584 (82%)
ఈసీఈ	5,847	4,691 (80%)
ఈఈఈ	5,881	3,803 (65%)
సివిల్	4,058	2,590 (64%)
మెకానికల్	4,107	2,224 (54%)

టైప్ రైటింగ్‌కు టాటా!

- ఈ ఏడాదే పరీక్షలు ఆఖరు
- ఉద్యోగాల భర్తీకి నో..
- ఇక నుంచి కంప్యూటర్ బైస్డ్ ఎగ్జామ్స్
- వ్యతిరేకిస్తున్న టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లు



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఎంతో మందికి టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగావకాశాలు, ఉపాధి కల్పించిన 200 ఏండ్లకు పైగా చరిత్ర గల టైప్ రైటింగ్ కోర్సులు ఇక కాలగర్భంలో కలవనున్నాయి. ఈ కోర్సులను మూసివేసే దిశలో సాంకేతిక విద్యాశాఖ అడుగులేస్తున్నది. టైప్ రైటింగ్ పరీక్షల స్థానంలో ఇక నుంచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇదే జరిగితే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కోర్టుల్లో ప్రతి ఏటా భర్తీచేసే వేలాది టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు మన విద్యార్థులు పోటీపడే అవకాశాన్ని కోల్పోనున్నారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వ శాఖల్లో టైప్‌రైటర్లు, స్టెనోగ్రాఫర్ పోస్టులు భర్తీచేయడంలేదు. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను మాత్రమే భర్తీచేస్తున్నారు. దీంతో టైప్ రైటింగ్ కోర్సులు అనవసరమన్న భావనతోనే మూసివేస్తున్నారు. దీనిని టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లు, విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

తమిళనాడు తరహాలో ప్రోత్సహించాలని డిమాండ్

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలను సాంకేతిక విద్యామండలి(ఎస్‌బీటెట్) ఏటా జూలై, డిసెంబర్‌లో నిర్వహిస్తున్నది. ఇవి పూర్తిగా సర్టిఫికెట్ కోర్సులు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 350 టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లున్నాయి. మరో 50 వరకు గుర్తింపులేకుండా నడుస్తున్నాయి. ప్రతి ఏడాది 4వేల మంది టైప్ రైటింగ్, వెయ్యి మంది షార్ట్‌హ్యాండ్ పరీక్షలకు హాజరవుతున్నారు. తమిళనాడు తరహాలో ఈ కోర్సులను ప్రోత్సహించాలని ఇన్‌స్టిట్యూట్ల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. తమిళనాడులో పదో తరగతిలోనే ప్రీ జూనియర్ అనే నూతన విధానాన్ని అమలుచేస్తున్నారు. టైప్‌రైటింగ్‌కు సమాంతరంగా కంప్యూటర్ కోర్సులోనూ విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు.

ఎస్సెస్సీ, కోర్టుల్లో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం



టైప్ మిషన్లపై ప్రాక్టీస్ చేస్తేనే స్పీడ్, కచ్చితత్వం మెరుగవుతుంది. మన దగ్గర టైప్‌రైటింగ్ ఉద్యోగాలు లేకుంటున్నారు. మరి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కోర్టుల్లో స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలను భర్తీచేస్తున్నారు కదా? ఈ కోర్సులను రద్దుచేస్తే, పరీక్షలను నిర్వహించడం ఆపేస్తే మన విద్యార్థులు ఆయా ఉద్యోగాలను కోల్పోరా? సీబీటీ పరీక్షలోనూ టైప్‌రైటింగ్ స్కిలున్నవారే ఇవ్వాలి. ఈ కోర్సులతో వచ్చే నష్టమేంటో అర్థం కావడంలేదు. ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించి, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), టైప్‌రైటింగ్ కోర్సులను సమాంతరంగా నిర్వహించాలి. పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించాలి.

- టి పతితపావనులు, తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్

'ఏకలవ్య'లో హర్యానా టీచర్లు

46 పోస్టుల్లో 43మంది వాళ్లే • మరో ముగ్గురూ ఢిల్లీ, రాజస్థాన్ అభ్యర్థులే

- తెలంగాణ నుంచి ఒక్క అభ్యర్థి కూడా లేరు
- దక్షిణాది రాష్ర్టాల్లోనూ ఇదే పరిస్థితి
- నియామకంపై అనేక అనుమానాలు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ఏకలవ్య పాఠశాలల్లో హర్యానా టీచర్ల నియామకం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల 46 పోస్టులను భర్తీ చేయగా, 43 మంది హర్యానాకు చెందిన వాళ్లే ఉండటం ఇందుకు బలం చేకూరుతున్నది. దేశవ్యాప్తంగా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) ఖాళీ పోస్టులను ఇటీవల కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్‌ఈఎస్‌టీఎస్) భర్తీచేసింది. దేశవ్యాప్తంగా జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జేఎస్ఏ) పోస్టులు 707, బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు 7,702 భర్తీచేసింది. తెలంగాణలోని ఏకలవ్య పాఠశాలల్లో భర్తీ చేసిన 46 పోస్టుల్లో 43 మంది ఒక్క హర్యానాకు చెందినవారే ఉన్నారు. మిగతా ముగ్గురు కూడా ఢిల్లీ నుంచి ఇద్దరు, రాజస్థాన్ నుంచి ఒక అభ్యర్థి ఉన్నారు. 46 పోస్టుల్లో తెలంగాణ నుంచి ఒక్క అభ్యర్థి కూడా లేకపోవడం గమనార్హం. ఇతర దక్షిణాది రాష్ర్టాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నదని తెలిసింది. మొత్తం స్టాఫ్‌లిస్ట్‌లో దక్షిణ భారతదేశం నుంచి ఎవరూ లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. దేశవ్యాప్తంగా 405 ఈఎంఆర్ఎస్ కొనసాగుతుండగా, మరో 708 స్కూళ్లను మంజూరు చేశారు. ఇంకా 32 పాఠశాలలను మంజూరు చేయాల్సి ఉన్నది. ఈఎంఆర్ఎస్‌లలో ఆరు నుంచి 12వ తరగతి వరకు బోధిస్తారు. తెలంగాణవ్యాప్తంగా 23 ఈఎంఆర్ఎస్‌లు ఉన్నాయి.

భూములివ్వం!

> మొదటిపేజీ తరువాయి...

ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం సర్వే నంబర్ 19లో తాము సాగు చేసుకుంటున్న భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, అధికారులు తమను మూడు నెలల నుంచి ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఏండ్ల నుంచి సాగు చేసుకుంటూ బతుకుతున్నామని చెప్పారు. వారసత్వంగా వ్యవసాయం చేసుకుంటూ ఆ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ఇప్పుడు అభివృద్ధి పేరిట ప్రభుత్వం తమ భూములను గుంజుకోవడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. తగిన విలువ కట్టకుండా అతి కొద్ది ముట్టజెప్పి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొడంగల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేయడం మంచిదే అయినా పేదలకు న్యాయం చేయకుండా భూములను స్వాధీనం చేసుకోవాలని చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎకరాకు 10 లక్షలు, ఉద్యోగం, ఇంటి స్థలం అని ఆశచూపి రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అన్యాక్రాంతమైన సీలింగ్ భూములను స్వాధీనం చేసుకొని అభివృద్ధి పనులు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని సూచించారు. భూముల స్వాధీనం తప్పదంటే భూసేకరణ చట్టం 2013లోని సెక్షన్ 10 ప్రకారం తాము కోరిన చోట భూమికి భూమి, మార్కెట్ ధర ప్రకారం రూ.50 లక్షల పరిహారం, ఇంటికో ఉద్యోగం, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో వివిధ పక్షాల నేతలు నాగిరెడ్డి, వెంకటయ్య, చంద్రయ్య, ఎరనపల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు, సూర్యనాయక్, లింగం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరేషాన్!

> మొదటిపేజీ తరువాయి...

ఇలా అస్తవ్యస్తంగా కేటాయించారు. ఈ నెల 18 నుంచి తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విద్యాశాఖ విడుదల చేసింది. ఎంతో ఉత్సాహంతో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు పరీక్ష కేంద్రాలను చూసి అవాక్కవ్వాల్సి వచ్చింది. అధికారులు స్పందించి తమకు ఒకేచోట పరీక్ష కేంద్రాలను కేటాయించాలని బాధిత అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా కేంద్రాల కేటాయింపు

- కే దామోదర్ అనే అభ్యర్థి స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్), సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఆయన స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పరీక్ష రాసేందుకు ఉదయం మేడ్చల్ కండ్లకోయ వద్ద గల సీఎమ్మార్ కాలేజీలో సెంటర్ కేటాయించారు. ఇదే అభ్యర్థికి మధ్యాహ్నం రెండు గంటలకు సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పరీక్ష కోసం నిజామాబాద్‌లో కేంద్రాన్ని కేటాయించారు.
- ఉమ అనే అభ్యర్థి రెండు ఉద్యోగాలకు దరఖాస్తు చేసింది. జూలై 20న ఒకే రోజు రెండు పేపర్లకు పరీక్ష జరుగనున్నది. వనపర్తికి చెందిన ఈమెకు ఉదయం కండ్లకోయలోని సీఎమ్మార్ కాలేజీలో స్కూల్ అసిస్టెంట్ పరీక్ష, మధ్యాహ్నం మహబూబ్‌నగర్ జిల్లాలోని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష కోసం కేంద్రాన్ని కేటాయించారు. ఒకదానికి హాజరైతే మరో పరీక్షను గైర్హాజరయ్యే ప్రమాదం ఉండడంతో ఉమ ఆందోళనలో ఉన్నది. పైగా 150 కిలోమీటర్లు ఒకే రోజు ప్రయాణించాల్సి ఉండడంతో దీని ప్రభావం పరీక్షపై పడుతుందని కలవరపడుతున్నది.
- మరో అభ్యర్థి రెండు పేపర్లకు దరఖాస్తు చేయగా, ఒక హాల్‌టికెట్‌పై ఫొటో ముద్రించగా, మరో హాల్‌టికెట్‌పై ఫొటోను ముద్రించలేదు. ఇదేం పరీక్ష.. ఇదేం పద్ధతి అంటూ ఆ అభ్యర్థి ప్రశ్నిస్తున్నారు.
- కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మహిళా అభ్యర్థి స్కూల్ అసిస్టెంట్ (గణితం) ఉద్యోగానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేందుకుప్రయత్నించగా మీ వివరాలు లభ్యంకావడం లేదని వెల్లడించగా, ఆందోళనలో ఆ అభ్యర్థి పడిపోయింది. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, 24 గంటల తర్వాత ఎట్టకేలకు శుక్రవారం రాత్రి అధికారులు హాల్‌టికెట్‌ను జారీచేశారు.

సర్కారు వైఫల్యం

డీఎస్సీ పరీక్షల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించి తప్పుల మీద తప్పులు చేస్తున్నది. పరీక్షల నిర్వహణలో తొలుత ఈ వైఫల్యానికి దారితీసిందని అనుమానాలకు తావిస్తున్నది. డీఎస్సీ వాయిదా వేయాలంటూ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుండా పట్టుదలకుపోయి అసలు విషయాలను నిర్లక్ష్యం చేస్తున్నది. కీలకమైన విద్యాశాఖకు రాష్ట్రంలో మంత్రి లేకపోవడం, ప్రిన్సిపల్ సెక్రటరీ.. వివిధ అదనపు బాధ్యతల్లో ఉండటంతో సరిగ్గా దృష్టి పెట్టలేకపోతున్నారు. డీఎస్సీ హాల్‌టికెట్ల జారీలోనూ జాప్యం జరిగింది. గురువారం సాయంత్రం 5 గంటలకే హాల్‌టికెట్లు జారీకావాల్సి ఉండగా, రాత్రి 7 గంటల తర్వాత విడుదల చేశారు. తీరా వచ్చిన హాల్‌టికెట్లు తప్పుల తడకగా ఉండటం అభ్యర్థులను కలవరపెడుతున్నది.

రైతన్నల బలవన్మరణం

> మొదటిపేజీ తరువాయి...

పంటను కాపాడుకోవడం కష్టంగా మారింది. ఐదు బోర్లు వేసినా నీరు అడుగంటడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. వ్యవసాయం కోసం చేసిన రూ.5 లక్షల అప్పులు తీర్చే మార్గం కన్పించక బుధవారం తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. పక్క పొలం రైతులు గమనించి రమేశ్‌ను వెంటనే చికిత్స కోసం దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, గురువారం రాత్రి మృతిచెందాడు. రమేశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

జనగామ జిల్లాలో కౌలు రైతు..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య (55)కు సొంతంగా భూమి లేకపోవడంతో కొంత వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. కూతురి పెండ్లితోపాటు వ్యవసాయ పెట్టుబడి కోసం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్రమనస్తాపానికి గురైన లక్ష్మయ్య ఈ నెల 9న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హనుమకొండలో ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

హిమాన్షును ఆశీర్వదించిన కేసీఆర్



తన మనుమడు హిమాన్షును బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆశీర్వదించారు. శుక్రవారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో హిమాన్షు పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మనుమడిని శతమానంభవతి అంటూ కేసీఆర్ దంపతులు ఆశీర్వదించారు. అనంతరం గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ వెలువరించిన హిమాన్షు మొక్క నాటారు. నానమ్మ శోభ, మాతృమూర్తి, కేటీఆర్ సతీమణి శైలిమ, అమ్మమ్మ శోభక్క, వినోదమ్మ, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ సహా పలువురు కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ మ్యానిఫెస్టో పెద్ద బక్వాస్

- జాబ్ క్యాలెండర్‌పై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల తలో మాట
- బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపాటు



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అంటేనే మోసాల దగా పార్టీ అని, కాంగ్రెస్ మ్యానిఫెస్టో పెద్ద బోగస్, బక్వాస్ అని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని అడిగితే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి తలో మాట మాట్లాడుతున్నారని, నిరుద్యోగులతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థులపై సీఎం, మంత్రులు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే నిరుద్యోగులు అడుగుతున్నారని, సీఎం, మంత్రులు వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని, వారికి సమాధానం చెప్పాల్సి వస్తుందని ముఖం చాటేస్తున్నారని దుయ్యబట్టారు. గ్రూప్ -1 విషయంలో 1:100 పిలుస్తామన్నది కాంగ్రెస్ నేతలేనని, గతంలో భట్టి విక్రమార్క స్వయంగా అసెంబ్లీలో డిమాండ్ చేశారని గుర్తుచేశారు. దీనిపై భట్టి ఇప్పుడు ఏం మాట్లాడుతలేరని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఎప్పుడు కోడ్ కారణంగా ఇవ్వలేకపోయామని మంత్రి పొన్నం అంటున్నారని, జాబ్ క్యాలెండర్‌కు అవసరమైన సిబ్బంది టీజీపీఎస్సీకి ఇస్తున్నామని, నిధులు సమకూరుస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెబుతున్నారని ఇలా తలోరకంగా మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు.

నిరూపిస్తే క్షమాపణ చెప్తారా?

'30 వేల ఉద్యోగాలు మీరు భర్తీ చేయలేదని నిరూపిస్తాం.. సీఎం, మంత్రులు క్షమాపణ చెబుతారా?' అంటూ ఎర్రోళ్ల సవాల్ విసిరారు. జాబ్ క్యాలెండర్ అని చెప్పిన ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చినట్టు నిరూపిస్తే ముక్కునేలకు రాస్తానని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో 41, 42 పేజీల్లో నోటిఫికేషన్ల తేదీలున్నాయని, వాటిలో దేనినీ అమలు చేయలేదన్నారు. నియామక పరీక్షలకు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని మ్యానిఫెస్టోలో చెప్పారని, కానీ డీఎస్సీ, గ్రూప్-1 ఫీజుల ద్వారానే ప్రభుత్వానికి రూ.42 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాగేందర్‌గౌడ్, పల్లె రవికుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, గోసుల శ్రీనివాస్ యాదవ్, రామ్మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

ఎడ్లను అమ్మి లంచం కట్టిన ఆదివాసీలు!

- పాత ఇంటి దర్వాజలకు అడవి కలప వాడారంటూ
- 30 వేలు డిమాండ్ చేసిన అటవీ అధికారులు
- ఆసిఫాబాద్ జిల్లా లెండిగూడ ఆదివాసీల ఫిర్యాదు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): పదేండ్ల క్రితం ఇంటికి ఏర్పాటు చేసిన దర్వాజలకు వాడిన కలపను అడవి నుంచి అక్రమంగా తీసుకువచ్చారని బెదిరించి రూ.30 వేలు వసూలు చేశారని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం లెండిగూడ ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. డీఎఫ్‌వో లేక ఎడ్లను అమ్మి వారికి లంచం కట్టినట్టు పేర్కొన్నారు. ఇదే విషయమై శుక్రవారం ఆదివాసీలు పెద్ద సంఖ్యలో డీఎఫ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. లెండిగూడకు చెందిన మడావి రాము, మడావి సాయినాథ్ పదేండ్ల క్రితం ఇండ్లు నిర్మించుకొని ఉంటున్నారు. ఈ నెల 4న ఆ ప్రాంతంలో అటవీ శాఖ ఎఫ్‌ఎస్‌వో రాంచందర్, ఎఫ్‌బీవో వనిత ఆదివాసీల ఇండ్లల్లో కలప ఉన్నదని అనుమానిస్తూ తనిఖీలు చేశారు. కలప దొరకకపోయేసరికి వారి ఇండ్లకు ఉన్న తలుపులు పాతవి కావని, కొత్తగా ఏర్పాటు చేశారని, అందుకు వాడిన కలపను అడవిలో నుంచి అక్రమంగా తీసుకువచ్చారని, జరిమానా విధించి కేసులు పెడతామని బెదిరించారు. రూ.30 వేలు ఇస్తే కేసులు లేకుండా వదిలేస్తామని చెప్పడంతో చేసేదేమీలేక తమవద్ద ఉన్న ఎడ్లను అమ్మి అధికారులకు ముడుపులు ముట్టజెప్పామని బాధిత ఆదివాసీలు వాపోయారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంఘం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎఫ్‌ఎస్‌వో రాంచందర్‌ను వివరణ కోరగా వారి ఇండ్లలో ఎలాంటి తనిఖీ చేయలేదని, ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదని చెప్పారు.

ఏపీ మాజీ సీఎం, ఇద్దరు ఐపీఎస్‌లపై కేసు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఐపీఎస్ పీవీ సునీల్‌కుమార్‌పై కేసు నమోదైంది. గత ప్రభుత్వ హయాంలో గుంటూరులో తనను కస్టడీకి తీసుకున్న సమయంలో హత్యాయత్నం చేశారని టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెక్షన్ 120బీ, 166, 167, 197, 307, 326,465, 508(34) ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. 2021 మే 14న తనపై హత్యాయత్నం చేశారని, రబ్బర్ బెల్ట్, లాఠీలతో కొట్టారని రఘురామ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో జగన్‌ను ఏ3గా పేర్కొన్నారు. ఏ1గా సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్, ఏ2గా ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ సీతారామాంజనేయులు, ఏ4గా విజయపాల్, ఏ5గా డాక్టర్ ప్రభావతిని చేర్చారు. మరికొందరి పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో పొందుపరిచారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం రావణకాష్టం

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం నంపల్లి ఆఫీస్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్-బీజేపీ ఒక్కటేనని చేసిన తప్పుడు ప్రచారం, గారడీ గ్యారంటీల వల్ల కాంగ్రెస్ గెలిచిందని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం ఉన్నదంటున్న రాహుల్ గాంధీ, దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటీలో తిరగాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ కాలంలో నిరుద్యోగ యువత విశ్వాసం కోల్పోయిందని చెప్పారు. బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి 15 అంశాలతో కూడిన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు, రాష్ట్ర స్థాయి నేతలు హాజరయ్యారు.

బుల్లెట్‌పై రాజాసింగ్

శుక్రవారం అసెంబ్లీ ఎన్నిక కార్యాలయంలో బీజేఎల్పీ సమావేశం జరిగింది. కొన్ని నెలలుగా అలకలో ఉన్న ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ సమావేశానికి బుల్లెట్‌పై రావడం అందరిలోనూ ఆసక్తి కలిగించింది.

లోకో పైలట్లకు సౌకర్యాలు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వేలో లోకో పైలట్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. వారిని గంటలను పరిశీలిస్తున్నామని, దీనిపై ఇప్పటికే సీపీఆర్వో, హైదరాబాద్ డివిజన్ అధికారులు నిర్దేశాలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. లోకో పైలట్లు విశ్రాంతి లేకుండా డ్యూటీ నిర్వహిస్తున్నారని, దాని ప్రభావం రైళ్ల భద్రతపై పడుతుందని నమస్తే తెలంగాణలో ఇటీవల కథనం ప్రచురితమైన నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారులు దీని పట్ల ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపింది.



శుక్రవారం తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

బీఆర్‌ఎస్ రక్షకులు ప్రజలే

- వారి ఆశీర్వాదంతోనే అధికారంలోకొస్తాం
- 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుతాం: శ్రీనివాస్ గౌడ్
- బీఆర్‌ఎస్ నుంచి దొంగలే బయటకు : మెతుకు ఆనంద్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్‌ను ప్రజలే రక్షకులని, వారి ఆశీర్వాదంతో తిరిగి అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తంచేశారు. తాత్కాలిక ప్రలోభాలతో బీఆర్‌ఎస్ ఏర్పాటైందని, ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ వస్తున్నదని చెప్పారు. బీఆర్‌ఎస్‌లోంచి కాంగ్రెస్‌కు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకత్వంపైనే విమర్శలు చేయడం సబబుకాదని, టీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు క్లైవ్లుగా ఉన్న నేతలే పార్టీకి ద్రోహం చేస్తున్నారని, బీఆర్‌ఎస్‌ను లేకుండా చేయడం ఎవరితరం కాదని స్పష్టంచేశారు శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎన్నికల ఫలితాలు పార్లమెంట్ ఎన్నికలకు భిన్నంగా ఉంటాయని, ప్రజలు వచ్చే ఎన్నికల్లో మంచి నిర్ణయం తీసుకుంటారని అభిప్రాయపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 'ఎమ్మెల్యేలు ఇష్టం లేకుండా పోయిండ్రు.. కానీ తల్లి లాంటి పార్టీని విమర్శించవద్దు' అని సూచించారు. బీఆర్‌ఎస్‌ను ఉద్యమంలోనే చంపాలని చాలా మంది ప్రయత్నించి విఫలమయ్యారని, ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్‌ను లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ లేకుంటే తెలంగాణ వచ్చేదా? అని, కేసీఆర్ ఉద్యమం చేయకుంటే స్వరాష్ట్రం సాకారమయ్యేదా? అని ప్రశ్నించారు. 'దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా పెట్టండి.. బీఆర్‌ఎస్ బలాన్ని చూపిస్తాం' అని స్పష్టంచేశారు.

నిజమైన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లోనే : మెతుకు ఆనంద్

బీఆర్‌ఎస్ నుంచి దొంగలే బయటకు వెళ్తున్నారని, నిజమైన కార్యకర్తలు పార్టీలోనే ఉంటున్నారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీ శంకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్‌సింగ్, పల్లె రవికుమార్ పాల్గొన్నారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఎవరి కోసం ఈ పునరుజ్జీవం?



అస్నాని మారుతీ సాగర్
90107 56666

ఉభయ తెలుగు రాష్ర్టాలకు సంబంధించి ఈ మధ్యకాలంలో కనిపించిన అరుదైన దృశ్యం ఇద్దరు సీఎంల మధ్య భేటీ. అది కూడా ఒకరు ఇండియా కూటమికి చెందినవారైతే, మరొకరు ఎన్డీయే కూటమికి చెందినవారు కావడం గమనార్హం. ఆ సంగతి అలా ఉంచితే ఆ భేటీ అనంతరం జరిగిన ఓ పరిణామం అందరి దృష్టిని ఆకర్షించింది. అదేమిటంటే.. తెలంగాణలో టీడీపీ పునరుజ్జీవం గురించి చంద్రబాబు మాట్లాడటం.



వాస్తవానికి తెలంగాణలో టీడీపీ పునరుజ్జీవం పొందితే ఎవరికి ప్రయోజనం? తెలంగాణ ప్రజలకు, తెలంగాణకు ఏమైనా మేలు జరుగుతుందా? తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు కండ్ల సిద్ధాంతంతో పైకి కనిపించిన బాబు.. వాస్తవానికి ఒక కంటితోనే చూశారు. ఉద్యమ సమయంలోనే కాదు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తన చూపు ఒకవైపేనని ఆయన స్పష్టం చేశారు. పదేండ్ల పాటు ఏపీలోనే రాజకీయం చేశారు. తెలంగాణలో టీడీపీ ఖాళీ అయినా ఆయన పట్టించుకోలేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీడీపీ పోటీ చేయదని చెప్పి.. పార్టీని నమ్ముకున్న వారి ఆశలపై నీళ్లు చల్లారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితా సిద్ధమైపోయాక, బీ ఫాంలు ఇవ్వడమే తరువాయి అనే సమయంలో.. పోటీ ససేమిరా అన్నారు బాబు. ఎవరి ప్రయోజనాల కోసం బరిలో నుంచి టీడీపీని ఎందుకు తప్పించారో తెలంగాణ ప్రజలకు తెలియనిది కాదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎట్టి పరిస్థితుల్లోనూ చీలడానికి వీల్లేదని భావించి, కాంగ్రెస్‌తో కుమ్మక్కై టీడీపీతో సెల్ఫ్ సూసైడ్ చేయించారు. అలాంటి బాబు నేడు ఆరు నెలలు తిరగకముందే పునరుజ్జీవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నది.

ఏపీలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు రాజకీయంగా చాకచక్యంగా పావులు కదుపుతున్నారు. ఏపీలో బీజేపీతో అధికారాన్ని పంచుకుంటూ.. తెలంగాణలో కాంగ్రెస్‌తో మైత్రి నెరపుతున్నారు. అటు ఏపీలోనూ కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉభయ రాష్ర్టాల్లో అక్కడ వైసీపీకి, ఇక్కడ బీఆర్‌ఎస్‌కు చెక్ పెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఏపీలో కూటమి నేతలు, కాంగ్రెస్ నాయకుల మధ్య పెద్దగా విమర్శలు, ప్రతి విమర్శలు లేవు. అక్కడ అన్ని పార్టీల టార్గెట్ వైసీపీయే. తెలంగాణలో బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతుండగా.. టీడీపీలోకి కూడా వలసలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే పార్టీ పునరుజ్జీవం గురించి వ్యాఖ్యానించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఉభయ రాష్ర్టాల్లోనూ గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను మార్పులు చేస్తూనే కొనసాగిస్తారే, అదేవిధంగా కొన్ని సంక్షేమ పథకాలు చేర్పులు చేస్తామని రెండు రాష్ర్టాల్లోని అధికార పార్టీలు చెప్తాయి. కానీ, పరిస్థితులు చూస్తుంటే.. సంక్షేమ పథకాల్లో మార్పు కంటే రాజకీయ మార్పులపైనే ఎక్కువగా చర్చ జరుగుతున్నది.

> టీడీపీ పునరుజ్జీవం గురించి మాట్లాడుతూనే బాబు మరో మాట కూడా చెప్పారు. తెలంగాణ గడ్డపైనే టీడీపీ పుట్టిందని, ఇక్కడ పుట్టిన పార్టీని మరోసారి ఇక్కడ బలంగా వ్యవస్థాపన చేయడం చేశారు. ఒకప్పటి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రబాబును కలిశారు. ఈ పరిణామాలను చూస్తుంటే.. ఈసారి బాబు వ్యూహాత్మకంగా తెలంగాణలో 6 ఎంపీ ఇప్పటికే స్థానాలు తెలుస్తున్నది. ఈ తరుణంలో తెలంగాణలో పుట్టిన టీడీపీ ఇక్కడి రైతుల పక్షాన నిలిచే విధానాలను ఎందుకు అమలు చేసింది? పోరు మోటర్లపై ఆధారపడి సాగు చేసే రైతులపై అదనపు కరెంట్ భారం ఎందుకు మోపింది? అనే ప్రశ్నలకు చంద్రబాబు సమాధానాలు చెప్పాలి.

అంతేకాదు, 1982 నాటికే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం కొన్ని సమూహాలు పనిచేస్తున్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణవాదం లేదని నిరూపించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. అందుకే 1990 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులకు రూరల్ తెలంగాణలోని నియోజకవర్గాల్లో టికెట్లు ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఒక నియోజకవర్గంలో సీమాంధ్ర నాయకుడిని బరిలో దింపారు. తెలంగాణ ప్రజలు అతన్ని ఓడించి, తెలంగాణవాదానికి జై కొట్టారు. అయితే తెలంగాణ ప్రాంతానికి చెందినవారితో కోస్తాలో పోటీ చేయించేందుకు సాహసం చేయలేదు నాటి టీడీపీ. తెలంగాణ ప్రాంతాన్ని తమ వలస ప్రాంతంగా చేసుకునేందుకు నాడు టీడీపీ ప్రయత్నించింది. దాన్ని ముందుగానే పసిగట్టిన తెలంగాణవాదులు వారి వ్యూహాలను తిప్పికొట్టారు.

అప్పటినుంచి జరిగిన దాని గురించి ఎందుకు. మొన్నటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చంద్రబాబు పోషించిన పాత్ర గురించి తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదు. సీమాంధ్ర నాయకుల రాజీనామా డ్రామాల వెనుక ఉన్నది బాబేనని నాటి ఉద్యమ సమాజానికి తెలుసు. డిసెంబర్ 9 ప్రకటన తర్వాత మరో ప్రకటన రావడం.. ఆ తర్వాత తెలంగాణలో వందలాది మంది బలి దానాలు చేసుకున్న వేదనాభరిత ఘటనలకు ఆయనే కారణం. ఎన్నో కష్టనష్టాలకోర్చి, ప్రాణత్యాగాలు చేసుకుని తెలంగాణ ప్రజలు స్వయం పాలన సాధించుకున్నారు. పదేండ్ల స్వయం పాలనా ఫలితాలను తెలంగాణ సమాజం అనుభవం ద్వారా చూసింది. ఉమ్మడి రాష్ర్టానికి, స్వయం పాలనకు మధ్య తేడా కూడా కనిపించింది. సీమాంధ్ర రాజకీయ కుట్రల ద్వారా ఇవన్నీ తమకు దూరమవుతాయనే ఆందోళన ఇప్పుడు తెలంగాణ సమాజంలో వ్యక్తమవుతున్నది.

సంక్షేమ రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు ఎటువైపు పయనిస్తున్నదో అర్థం కావడం లేదు. ఈ సందర్భంలోనే తెలంగాణలో టీడీపీని పునరుజ్జీవింపజేస్తామని చంద్రబాబు చెప్పడమంటే ముమ్మాటికీ తెలంగాణ ప్రయోజనాలకు భరోసా లేదు, భవిష్యత్తును గందరగోళంలో పడేసినట్టే. పదేండ్లుగా 'జై ఆంధ్ర' నినాదమే వర్ధిల్లిన ఆ నోట కొత్తగా 'జై తెలంగాణ' అనే నినాదం రావడం ఆంధ్ర వాళ్లకు ఆలోచింపజేయవచ్చేమో కానీ, తెలంగాణవాళ్లకు మాత్రం పక్కా అంటే కనుక గుర్తిస్తున్నది.

> పదేండ్ల తర్వాత మళ్లీ ఆంధ్రావాళ్ల పెత్తనం పెరిగితే ప్రత్యక్ష యాదవ్ తెలంగాణ సమాజాన్ని ఆలోచింపజేస్తున్నది. రాబట్టి స్వయంపాలన కోసం తండ్లాడి సాధించుకున్న తెలంగాణలో మొదలవుతున్న కుట్రలను ఆదిలోనే అడ్డుకట్ట వేయాలి. ఈ కుయుక్తుల నేపథ్యంలో తెలంగాణ ప్రజలు మరో ఉద్యమానికి సమాయత్తం కావాలి.

పోరుగడ్డ ఓయూలో క్షీరాభిషేకాలా?



ప్రశాంత్ పగిళ్ల
95812 62429

> ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ మసకబారుతున్నది. ప్రశ్నించేతత్వాన్ని క్రమంగా ఓయూ కోల్పోతున్నది. తెలంగాణ ఏర్పాటుకు ముందు, తర్వాత చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం సులువుగానే అర్థమవుతుంది. ఓయూ అంటే నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల వ్యక్తీకరణే కాదు, ప్రపంచ దేశాల్లోని ప్రజాస్వామిక ఉద్యమాలకు గొంతు కలిపి, నినదించిన చరిత్ర కూడా.



పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరుగుతున్న మానవ హననం, మణిపూర్ అమానవీయ గాయాలు, ఎక్కడో గాజా, మరెక్కడో ఉక్రెయిన్.. ఇలా ఎక్కడ అన్యాయం జరిగినా న్యాయం కోసం గొంతెత్తిన పోరు పాఠశాల ఓయూ. దూరంగా నిలబడి బాధితులకు సంఘీభావం తెలపడం కూడా నిబద్ధమైన చోట, ఓయూ గర్జన స్వరం వినిపిస్తూనే ఉంటుందని అనేకసార్లు చాటింది. అదే కోట్లాది జనులకు ఓయూపై ఓ ఆశ, ప్రేమ, భరోసా కలిగేందుకు కారణమైంది. ఈ నేల మీద తీవ్రమైన సంఘర్షణ కొనసాగినప్పుడు సగటు తెలంగాణ బుద్ధిజీవి పాలకపక్షాన్ని కాదని, ఓయూ వైపు ఆశగా చూడటం ఎప్పుడో ప్రారంభించాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో 'ఉద్యమానికి మేం నాయకత్వం వహిస్తామనే గంభీరమైన ప్రకటన ఎంతోమందికి ఓయూపై అమితమైన విశ్వాసాన్ని కలిగించింది. అందుకే ఉద్యమ సమయంలో ఓయూతో తెలంగాణ కలిసి నడిచింది. 'రాజకీయాలకు తలొగ్గని తెగువ, ప్రజా ఆకాంక్షల దివిటీ' ఓయూ అనే విశ్వాసంతోనే ఓయూను తెలంగాణ గుండెల నిండా ప్రేమించింది, ప్రేమిస్తున్నది కూడా. కానీ, ఇప్పుడు ఓయూ ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమవుతూ, తన సహజత్వాన్ని కోల్పోతున్నది.

ఓయూ ప్రశ్నించడం మానుకుంటున్నది. ఒకానొక దశలో పిలుపుతోనే ప్రభుత్వాలను గడగడలాడించిన ఓయూ విద్యార్థి సంఘాలు.. ఇప్పుడు ప్రభుత్వ భజన బృందాలుగా మారడం ఈ దశాబ్ద కాలపు విషాదం. గతంలో ఎంతోకొంత అలజడి కనిపించింది. ప్రభుత్వాన్ని ఓయూ నిలదీసింది. తాను తలుచుకుంటే ప్రభుత్వాన్ని సైతం మార్చేసే పరిణత్వం కలిగిన ఓయూ.. ఇప్పుడు అప్రకటిత నిర్బంధం విధిస్తున్న రేవంత్ రెడ్డిని కీర్తించడం, పాలకపక్ష దుర్మార్గ విధానాలపై నోరెత్తకపోవడం ఓయూపై ప్రజలకున్న నమ్మకాన్ని వమ్ముచేయడమే. ఆవేదన, అన్యాయం, అక్రమాలపై పోరాటాలకే వేదికగా నిలిచే ఆర్ట్స్ కాలేజీ.. తన ప్రాంగణంలో పాలకులకు జరుగుతున్న పాలాభిషేకాలను తన గుండెల మీద పెనుమంటల గాయాలుగా భావిస్తున్నది. ప్రధాన ప్రతిపక్షమై నిలిచిన ఓయూ చరిత్రకు మెజారిటీ విద్యార్థి సంఘాలు చితులను పేర్చుతున్నాయి. అన్యాయాన్ని ఎండగట్టడం తప్పితే సమర్థించిన చరిత్ర లేని ఓయూకు తలవంపులు తీసుకువస్తుండటం భావదారిద్ర్యమే.

హక్కుల కోసం పోరాడితే అరెస్టులు, నిరసిస్తే వెంటనే ముట్టడింపు, నిరుద్యోగుల కోసం ప్రజాస్వామ్యయుతంగా దీక్షలు చేస్తే క్షణాల్లో అరెస్ట్ చేయడం, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే ముందస్తు అరెస్టులు చేయడం, నిర్బంధించడం.. ఓయూలో ఇవన్నీ మన కండ్లముందే జరుగుతుండగా.. కాంగ్రెస్ హయాంలో మార్పు వచ్చిందంటే ఎలా నమ్మాలి. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఆ హామీలను 'మోదీ హామీ' అని ప్రియాంకాగాంధీ ప్రకటించారు. కానీ, తామిచ్చిన ఈ హామీ ఇవ్వలేదని నిస్సిగ్గుగా డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానిస్తే.. ఓయూలోని ఒకటి, రెండు మినహా అన్ని విద్యార్థి సంఘాలు పెదవి విప్పకపోవడం దేనికి సంకేతం? ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకున్నా విద్యార్థి సంఘాలు నోటికి తాళం వేసుకోవడం దుర్మార్గం కాదా? 1200 మంది అధ్యాపకులు ఉండాల్సిన ఓయూలో కేవలం 300 మంది మాత్రమే ఉన్నారు. తద్వారా విద్యావ్యవస్థ గాడితప్పుతుంటే మౌనం వహిస్తూ, ప్రభుత్వాన్ని కీర్తించడం వర్సిటీలోని విద్యార్థి సంఘాల దిగజారుడుతనానికి పరాకాష్ఠ కాదా? పూర్తి ప్రజాస్వామిక హక్కులతో ఉండాల్సిన వర్సిటీ ప్రాంగణంలో పోలీసులు అక్రమంగా చొరబడి, విద్యార్థులను ఎత్తుకుపోతుంటే విద్యార్థి సంఘాలు ఐక్యం కాకపోవడం ఓయూ స్వభావానికి తిరోగమనం కాదా? అనేక సమస్యలతో ఓయూ సతమతం అవుతుంటే, వాటిని వదిలేసి.. ప్రభుత్వానికి పక్క వాదిగా మారడమంటే ఓయూ విద్యార్థి సంఘాల దొస్తుత్వానికి పెద్ద మచ్చే.

తెలంగాణను రక్తసిక్తం చేసిన దుర్మార్గుడు, ఒకనాటి ఓయూ ఉద్యమకారులను పొట్టనబెట్టుకున్న చంద్రబాబు ఈ నేలపై అడుగుపెడితే పాలాభిషేకాలు చేయడం ఓయూ పోరాట వారసత్వాన్ని దెబ్బతీయడమే. తన వందేండ్ల చరిత్రలో ప్రతిసారి ప్రతిఘటన పోరాటాన్ని ప్రదర్శించిన ఓయూ సహజ స్వభావాన్ని గడిచిన కొన్నేండ్లుగా ప్రదర్శించకపోవడం లక్షలాది గుండెలకు గాయం చేస్తున్నది. నాటి నక్సల్ ఉద్యమాలకు నాదు, రైతాంగ ఉద్యమాలకు మద్దతుగా నిలిచిన ఓయూ.. ప్రభుత్వాల ఎజెండాలో భాగస్వామ్యం కావడం తెలంగాణవాదులను కలవరపరుస్తున్నది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏడో గ్యారెంటీ అని ప్రకటించిన కాంగ్రెస్.. అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్నది. ప్రధాన ప్రతిపక్ష పార్టీని బొందపెడతాన కాంగ్రెస్ కుట్రలు చేస్తుండటంతో ఓయూ అయినా ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తుందని ప్రజానీకం గంపెడు ఆశలు పెట్టుకున్నది. కానీ, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వానికే తల కీర్తనలో తరించిపోవడం ఎంతో బాధాకరం. ఓయూ విద్యార్థి సంఘాలు ఇకనైనా ప్రభుత్వానికి తోలుబొమ్మలుగా మారడం మానుకోవాలి. ఘనమైన చరిత్ర కలిగిన ఓయూ ఇకనైనా ఉద్యమాలను నిర్మించడంలో భాగమవుతుందని ఆకాంక్షిద్దాం.

> ఆవేదన, అన్యాయం, అక్రమాలపై పోరాటాలకే వేదికగా నిలిచే ఆర్ట్స్ కాలేజీ.. తన ప్రాంగణంలో పాలకులకు జరుగుతున్న పాలాభిషేకాలను తన గుండెల మీద పెనుమంటల గాయాలుగా భావిస్తున్నది. ప్రధాన ప్రతిపక్షమై నిలిచిన ఓయూ చరిత్రకు మెజారిటీ విద్యార్థి సంఘాలు చితులను పేర్చుతున్నాయి. అన్యాయాన్ని ఎండగట్టడం తప్పితే సమర్థించిన చరిత్ర లేని ఓయూకు తలవంపులు తీసుకువస్తుండటం భావదారిద్ర్యమే.



ఆహా.. అని తింటే.. దవాఖానకే!

> 'తిండి కలిగితే కండ కలదోయ్' అన్న మహాకవి మాట తినడానికి నోచుకోని నాటి కాలానికి సంబంధించినది. ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించిన నేపథ్యంలో "నాణ్యమైన తిండి కలిగితేనే కండ కలదోయ్!" అనే మాట నేడు సార్థకమవుతుంది. ప్రామాణికమైన ఆహార పదార్థాలతోనే ఆరోగ్యం సంతరించుకుంటుంది.



పార్థసారథి తీగుళ్ల

నేను ఒకసారి అమెరికా వెళ్లేటప్పుడు లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో విమానం మారవలసి వచ్చింది. నేను హైదరాబాద్ నుంచి వస్తున్నానని గ్రహించిన పాస్‌పోర్ట్ తనిఖీ అధికారులు.. 'మరోసారి వచ్చేటప్పుడు హైదరాబాద్ బిర్యానీ తేగలరా' అని అడిగారు. మన హైదరాబాద్ బిర్యానీకి పర్యాయపదంగా మారిపోయిందని నాకు అప్పుడు అర్థమైంది. ఎప్పుడో అంతర్జాతీయంగా పేరుపొందిన హైదరాబాద్ బిర్యానీ ఘుమఘుమలు మనకు మాత్రం సుపరిచితమే. ఇప్పుడు అసలుసిసలైన హైదరాబాద్ బిర్యానీ హైదరాబాద్‌లోనే దొరికే పరిస్థితి లేదు. ఏ వంటకం చూసినా కల్తీమయం కావడమే అందుకు కారణం.

వంటలలో రారాజులాంటిది హైదరాబాద్ బిర్యానీ. కోడిగుడ్డు, మాంసం, నెయ్యి, కూరగాయలు, ఇతర దినుసులు వాడటం వల్ల అది ఆరోగ్యాన్ని ప్రసాదించే వంటకంగా తయారవుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. హైదరాబాద్ బిర్యానీలో పసుపు, జీలకర్ర, ఎండుమిర్చి, అల్లం, వెల్లుల్లి, కుంకుమపువ్వు లాంటి అనేక పదార్థాలు కలుపుతారు. ఇవన్నీ యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లితో వంటకం రుచికరంగా తయారవుతుంది. వీటిలో సల్ఫర్ సమ్మేళనాలు, మెగ్నీషియం, విటమిన్ బీ6, విటమిన్ సీ ఉంటాయి.


అయితే బిర్యానీలో ఎన్ని పదార్థాలున్నా ఏం ప్రయోజనం.. ఆహార కల్తీ కారణంగా అసలు సిసలు హైదరాబాద్ బిర్యానీ కనుమరుగవుతున్నది. ఆహా.. అని తింటే తప్పక దవాఖానకు వెళ్లాల్సిన పరిస్థితి. నగరవాసులకు ఆహార కల్తీ అంత తీవ్రంగా కలవరపెడుతున్నది. హోటళ్లు, రెస్టారెంట్లలో తాజా ఆహారంలో మక్కిపోయిన ఆహారాన్ని కలిపి వడ్డిస్తుండటం అందోళనకరం. చేపలు, మాంసం, కూరగాయలను తాజాగా ఉంచడానికి రెస్టారెంట్లు యాజమాన్యాలు కొన్ని రసాయనాలను ఉపయోగిస్తుండటంతో కల్తీ జరుగుతున్నది. బేకరీ ఉత్పత్తుల్లో కలిపే రసాయనాలు విష పదార్థాలుగా ప్రభావం చూపుతాయి. బ్యాక్టీరియా, వైరస్‌లతో పాటు హానికరమైన రసాయనాలు చేరి ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి. సరైన పరిశుభ్రత పద్ధతులు పాటించకపోవడం, పురుగు మందుల వినియోగం, రుచి కోసం వాడే రసాయనాలు ఇందుకు దారితీస్తున్నది.

యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అధికారుల నివేదిక ప్రకారం.. మన దేశంలో సుమారు 527 రకాల ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక ఇథిలీన్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంది. వీటిలో నిత్యం మనం వాడే పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, గుడ్లు వంటివెన్నో ఉన్నాయి. ఇక, సరిగా ఉడకని మాంసం, సీఫుడ్‌లో ఉండే సాల్మొనెల్లా, కాంపిలోబాక్టర్, ఈ-కోలీ వంటి బ్యాక్టీరియాలు జీర్ణాశయ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఆహార పదార్థాలను ఎక్కువకాలం నిల్వ చేయడం వల్ల శిలీంధ్ర జాతి (అఫ్లాటాక్సిన్) కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతుంది. కార్బైడుల్, సీసం వంటి లోహాలు ఒంట్లో చేరితే.. కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని రోగ నిరోధక వ్యవస్థ కుంటుపడుతుంది. ఇవన్నీ మహిళల పునరుత్పత్తి సామర్థ్యంపై తీవ్రంగా ప్రభావం చూపిస్తాయి. కల్తీ ఆహారంతో ఆకలిచావు, అలర్జీలు, ఆస్తమా, ఆర్థ్రైటిస్, అల్సర్, క్యాన్సర్ రుగ్మతలు వస్తాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆరోగ్య శాఖ ఆదేశాలతో సంబంధిత శాఖాధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కొలువుదీరిన టాస్క్‌ఫోర్స్ బృందం కొన్ని రోజులుగా నగరంలోని హోటళ్లలో తనిఖీలు చేస్తున్నది. అయితే తనిఖీ నివేదికపై వ్యాపారులు సంతకం చేసేందుకు నిరాకరించే పరిస్థితి ఉందంటే ఆహార కల్తీ, అపరిశుభ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

> రాష్ట్రంలో కల్తీ రాజ్యమేలుతున్న తరుణంలో ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అనారోగ్యాలకు గురవుతూ దవాఖానలకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీకి పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

1976 ఆహార భద్రత చట్టం ప్రకారం.. కల్తీ వ్యాపారులకు నోటీసులు జారీ చేసి శిక్షించాలి. అంతేకాదు, వినియోగదారులకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రచురణలు, స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకొని కల్తీ ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలి. కల్తీని సులభతరంగా గుర్తించే పరీక్షలను అమలుచేయాలి. పార్శ్వ ప్రణాళికలో ఆహార కల్తీ అంశాన్ని చేర్చడం తక్షణ చర్య. ప్రభుత్వం రూపొందించిన టాస్క్‌ఫోర్స్ క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, ప్రజలను అప్రమత్తం చేయడం ఇప్పుడు ఆత్యవసరం.

(వ్యాసకర్త: రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా యూనివర్సిటీ)



నరంలేని ఎలుక!


తప్పెవరిది కాదు
తొందర పాటంతా నాదే
వేలుసార్లు బల్లి పడింది కదాని
నేను దుంకాను అంతే..!

బొద్దింకలు ఈగాలు
ఎన్నిసార్లు పడినా
అది సాంబార్‌తో కలిసిపోయి
నాకే తెలియ లేదు..!

తెలియనిది గిన్నె మీంచి
వెళ్లే ఉండని చూసుకోక ఎగిరాను
కాలు జారి మీ వీడియో కంట పడ్డాను
దొరికిన దొంగనయ్యాను!

ఒకప్పుడు ప్రాణ భయంతో నేను
విలవిలలాడుతుంటే ప్రాణ వదులేక
వీడియో తీసిన వారిని కదా
అనాల్సింది తిట్టాల్సింది!

ఆ పేద విద్యార్థులకు
ఆహారమైనా బాగుండేది
ఎలుక భావిస్తే పదే పదే చూపిస్తుంటే
గ్రేస్ తీసుకున్న సిల్లుమిటియన్యా!
ఇది మాకు తొలిసారి కాదు



మీకు చివరిది కూడా కాదు
ఇట్లా దొరికిపోయినప్పుడు తప్ప మేం
పేద విద్యార్థులకు రక్త సంబంధీకులమే!
దయచేసి వంటవాళ్లని ఏమనకండి
వాళ్లు వండే ప్రతి పాటలో
ఉప్పు తక్కువైనప్పుడల్లా
స్వయం దూకుతున్నాము!!
(మొయినాబాద్ జ్యోతిబాపూలే హాస్టల్‌లో చట్నీలో ఎలుక ఈదులాడటం చూసి...)



కొత్త వెంకటేశ్వర రెడ్డి
94402 33261

ఇది కదా అసలైన ఎమర్జెన్సీ!



ఎమర్జెన్సీకి నేనూ వ్యతిరేకమే. కానీ, దేశంలో అసలైన ఎమర్జెన్సీ మోదీ హయాంలోనే అమలైంది. క్రిమినల్ చట్టాల్లో మోదీ సర్కార్ చేసిన మార్పులే దానికి తాజా ఉదాహరణ. భారతీయ న్యాయ సంహితలో ఏముందో ఎవరికీ తెలియదు. దానిగురించి కనీసం ప్రతిపక్షంతోనూ చర్చించలేదు. 147 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ఈ మూడు చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఇది కదా అసలైన ఎమర్జెన్సీ.

- మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

వేర్వేరు స్టేషన్లుగా గ్రేటర్ జిల్లాలు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలను వేర్వేరు స్టేషన్లుగా పరిగణించాలని ఆర్థికశాఖ ఉత్తర్వులిచ్చింది. దీంతో అక్కడి వారు ఇక్కడికి.. ఇక్కడి వారు అక్కడికి బదిలీ అయ్యే అవకాశం దొరికింది. రెండు జిల్లాలకు చెందిన కార్యాలయాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉంటే మాత్రం, జీహెచ్ఎంసీలోనే అంతర్భాగంగా పరిగణిస్తారు. జీహెచ్ఎంసీ బయట ఏ జిల్లాలో ఉంటే ఆయా జిల్లా స్టేషన్‌గా పరిగణిస్తారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ సీఎస్‌ను కలిసి నిబంధనలు మార్చాలని కోరారు. స్పందించిన సర్కారు వేర్వేరు స్టేషన్లుగా పరిగణనలోకి తీసుకుంటూ ఉత్తర్వులిచ్చింది.

దేవాదాయ శాఖ ఈవోలకు ఉద్యోగోన్నతి

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): దేవాదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఆలేండ్లుగా సర్వీస్ రూల్స్, సీనియారిటీ విషయంలో జాప్యం కారణంగా ఉద్యోగోన్నతిలో ఇబ్బందులు తలెత్తాయి. తాజాగా సమస్య పరిష్కారంతో 11 మంది ఈవోలకు లబ్ధి చేకూరింది. ముగ్గురు గ్రేడ్-3 ఈవోలు గ్రేడ్-1గా, 8 మంది గ్రేడ్-3 ఈవోలు గ్రేడ్-2గా ఉద్యోగోన్నతి పొందారు. ఇందుకు మంత్రి కొండా సురేఖకు ఆలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బేతి రంగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పదోన్నతుల్లో నిబంధనలు పాటించాలి

తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం

హైదరాబాద్, జూలై12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఏండ్ల తరబడిగా ఎదురుచూస్తున్న అర్హులైన డిగ్రీ లెక్చరర్లకే ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శారద, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సత్యశ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అనధికార అర్చక బదిలీలు!

- ఎండోమెంట్ యాక్ట్‌కు దేవాదాయ శాఖ తూట్లు
- ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతో ప్రక్రియ
- స్థాన చలనం చట్ట విరుద్ధమంటున్న సంఘాలు
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరికలు



వేములవాడ/వేములవాడ టౌన్, జూలై 12: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ అర్చకులపై కత్తిగట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఆలయ అర్చకులనూ బదిలీ చేయాలని నిర్ణయించింది. ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయాల్లో పనిచేసే అర్చకులు సదరు ఆలయ విశిష్ట సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించాల్సి ఉండటంతో బదిలీ చేయరాదనే నిబంధన ఉన్నా ఏ మాత్రం లెక్కచేయకుండా ముందుకుసాగుతున్నది. ఇది సరైన పద్ధతి కాదని, నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

బదిలీలు చట్ట విరుద్ధం

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఎండోమెంట్ యాక్ట్ 87, సెక్షన్ 142 ప్రకారం ఆలయాల్లో పనిచేసే అర్చకులను బదిలీ చేయరాదనే నిబంధన ఉన్నది. ఎక్కడికక్కడ ఆలయాల్లో ఉన్న విశిష్ట సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించాల్సి ఉన్నందున అదే ఆలయంలో పనిచేయాలని చట్టంలో ఉన్నది. బదిలీలకు నిబంధనలు అడ్డువస్తాయని భావిస్తున్న అధికారులు, అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతో పూజారుల్లోనూ 40 శాతం బదిలీల వ్యవహారం తెరమీదికి తేవడం కలకలం రేపుతున్నది. బలవంతంగా బదిలీల కోసం ఒత్తిడి తెస్తుండటంతో కలవరపడుతున్నారు. అర్చకుల విధుల్లో ఏదైనా తప్పిదాలు జరిగితే ఎక్కడికక్కడే చర్యలు తీసుకోవాలి. కానీ, ఇతర దేవాలయాలకు బదిలీ చేయడం ద్వారా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్టే అవుతుందని అర్చక సంఘాలు తప్పుపడుతున్నాయి.

ఒక్కో ఆలయంలో ఒక్కో విధంగా పూజలు

రాష్ట్రంలోని ఒక్కో ఆలయానికి ఒక్కో విశిష్టత ఉన్నది. అక్కడి సంప్రదాయం ప్రకారం అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాంచరాత్రా ఆగమం, భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పాంచారాత్రాగమం, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో దాత్తార వైష్ణవం, బాసర సరస్వతీ దేవి ఆలయంలో స్మార్త సంప్రదాయం, కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో వీరశైవ గొల్ల, కురుమ వ్యవస్థ ద్వారా పూజలు జరుగుతుంటాయి. వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారికి సుప్రభాతం మొదలుకొని ఏకాంత సేవ వరకు విశేష పూజలు, ఉత్సవాలు జరుగుతుంటాయి. మహాశివరాత్రి రోజు 3 గంటలు మహా లింగార్చన, శుక్ర, సోమవారం ప్రత్యేక కీర్తనలతో ఏకాంత సేవ ఉంటుంది. ప్రాతఃకాల పూజ, పౌరాణిక స్తోత్రాలు, వైదిక విధానంతో కూడిన ప్రదోష పూజ, నిశి పూజ మొదలైన విధానాలు ఉంటాయి. ఈ పూజా విధానాలు దేవాదాయ శాఖ వారు నిర్వహించే ఆగమ పరీక్షల సిలబస్‌లో కనిపించవు. ఇక రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రతి శుక్రవారం చతుష్షష్టి ఉపచార పూజ రెండువేళలా విశేషంగా జరుగుతుంది. రాజన్న క్షేత్రం హరిహర క్షేత్రంగా పిలవబడుతుంది. ఇక్కడ స్వామివారితోపాటు సీతారామచంద్రస్వామి, లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారికి పునర్వసు, రేవతి నక్షత్రములందు పంచోపనిషత్ ద్వారా మహాభిషేకం పూజలు నిర్వహిస్తారు. శివకల్యాణం పాంచాహ్నిక ధ్వజారోహణ విధానంలో, రామ కల్యాణం ప్రత్యేకమైన విధానంతో నిర్వహిస్తారు. అన్న పూజ, ఆకు పూజలు చేయడతారు. ఈ పూజా విధానాలు సిలబస్ రూపంలో ఎక్కడా ఉండవు.

వేములవాడలోని కైంకర్యాలు ఎక్కడా ఉండవు



ఏ ఆలయమైనా ఆ గుడి సంప్రదాయాలు, ఆ ప్రాంత విశిష్టతలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఇవి వేల సంవత్సరాల తరబడిగా వస్తున్న ఆనవాయితీ. అలా పూజలు చేసే అర్చకులను మరో ప్రాంతానికి బదిలీ చేయడం అనేది సరైన పద్ధతి కాదు. అలా చేయడం కూడా ఆలయ సంప్రదాయాలకు తిలోదకాలిచ్చినట్టే. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే కైంకర్యాలు దేశంలోనే ఎక్కడా ఉండవు.

- గోపన్నగారి శంకరయ్య, రిటైర్డ్ స్థానాచార్యులు, రాజన్న ఆలయం, వేములవాడ

ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



అర్చక బదిలీలు చట్ట విరుద్ధం. దేవాదాయ శాఖ చట్టంలోనే అర్చక బదిలీలపై నిబంధన ఉన్నది. ఏ క్షేత్రానికి అనుగుణంగా అక్కడి సంప్రదాయాన్ని అనుసరించిన పూజా విధానాలు ఉంటాయి. బదిలీలతో వాటి విశిష్టతను కోల్పోయే ప్రమాదం ఉన్నది. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతో అర్చక ఉద్యోగులను బలవంతంగా ఒత్తిడి తెచ్చి కారులు జరుగుతున్నారు. అర్చక బదిలీల ప్రక్రియను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. రాజన్న దేవాలయంలో ఖాళీగా ఉన్న అర్చకుల పోస్టులను భర్తీ చేయకుండా బదిలీ చేయడాన్ని తప్పుపడుతున్నాం. బదిలీలు కొనసాగితే వేములవాడ అనువంశిక అర్చక సంఘం తరఫున ఆందోళనకు దిగుతాం.

- ప్రతాప రామకృష్ణ, అనువంశిక అర్చక సంఘం అధ్యక్షులు, వేములవాడ

బ్రాహ్మణ సంక్షేమం అగమ్యగోచరం

➤ మొదటిపేజీ తరువాయి...

బ్రాహ్మణుల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటును ఇవ్వాలనే సమున్నతంతో కేసీఆర్ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును ప్రారంభించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిషత్తు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. విద్య, స్వయం ఉపాధి, వేదవిద్యకు ప్రోత్సాహం కోసం అమలు చేసిన వివిధ పథకాలు ఆగిపోవడం విచారకరమని వెల్లడించారు. రాష్ట్రంలో అసలు బ్రాహ్మణ పరిషత్తు ఉన్నట్టా? లేనట్టా? అన్న ఆందోళన బ్రాహ్మణుల్లో నెలకొన్నదని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలోని తమ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు కోసం ఏటా రూ.100 కోట్లు క్రమం తప్పకుండా కేటాయించిందని గుర్తుచేశారు. స్వామి వివేకానంద పేరుతో విదేశీవిద్యానిధి పథకం, శ్రీరామానుజ పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, వేదహిత పేరుతో వేద పాఠశాలలు, వేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రతి నెల వేద శాస్త్ర పండితులకు గౌరవ వేతనం, ప్రోత్సాహక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆర్థికప్రోత్సాహం, బ్రాహ్మణ యువతకు పోటీ పరీక్షల శిక్షణ వంటి పథకాలను అమలుచేసి ఎంతోమంది పేద బ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగులు నింపామని వివరించారు. విదేశీవిద్యానిధి పథకం కింద 780 మంది పేద బ్రాహ్మణ విద్యార్థుల కోసం రూ.20 లక్షల చొప్పున కేసీఆర్ సర్కారు ఖర్చు చేసిందని, 436 మంది విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్స్ అందించిందని, ప్రోత్సాహక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకంగా 5,074 మందిని గుర్తించి రూ.150 కోట్ల ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. బ్రాహ్మణుల గౌరవాన్ని పెంచేలా దేశంలోనే తొలిసారిగా, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలో రూ.12 కోట్లతో 10 ఎకరాల విస్తీర్ణంలో విప్రహిత బ్రాహ్మణ సదన్ నిర్మించి, బ్రాహ్మణ సంక్షేమంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్కారు పరిష్కరించాల్సిన సమస్యలను లేఖలో ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు గతంలో మాదిరిగానే నిధులు విడుదల చేయాలి. వార్షిక బడ్జెట్‌లో ఏటా రూ.100 కోట్లు కేటాయించాలి. బ్రాహ్మణ పరిషత్తు పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.
- విదేశీవిద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకొని, ఎంపికైన 300 మంది విద్యార్థులు ఇప్పటికే విదేశాల్లో చదువుతున్నారు. వారికి స్కాలర్‌షిప్స్ అందకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన రూ.30 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలి. 2023-24కిగాను ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న 344 మంది విద్యార్థులకు తక్షణమే ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి.
- బ్రాహ్మణ ఆంత్రప్రెన్యూర్ స్కీం ఆఫ్ తెలంగాణ (బెస్ట్) కింద దరఖాస్తు చేసుకొని, ఎంపికైన 497 మందికి రూ.16 కోట్లు విడుదల చేయాలి. 706 మందికి ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తి చేసి, 2023-24కి దరఖాస్తు చేసుకున్న 1,869 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించాలి.
- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తులో పనిచేస్తున్న ఉద్యోగులకు 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి.
- వేద పాఠశాలల్లోని వేద పండితులకు 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.5 వేల గౌరవ వేతనాన్ని తక్షణం చెల్లించాలి.
- 75 ఏండ్లు పైబడిన వేద పండితులకు ఇచ్చే రూ.5 వేల భృతి 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వారికి ఆర్థిక చేయూత ఎంతో అవసరం కాబట్టి వెంటనే చెల్లించాలి.
- సూర్యాపేట, ఖమ్మం, మధిరలో నిర్మించతలపెట్టిన బ్రాహ్మణ సదనాల పనులు ఆగిపోయాయి. వాటిని వెంటనే పూర్తి చేయాలి.



మైనర్‌పై పోలీసుల కాల్పులు

నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద డెకాయిట్ ఆపరేషన్

- మారణాయుధాలతో నిందితుల దాడి
- పోలీసుల కాల్పులు.. మరొకరు అరెస్టు

సుల్తాన్‌బజార్, జూలై 12: హైదరాబాద్ నడిబొడ్డున కాంతిభద్రతలు విఫలం అయ్యాయి. నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అర్ధరాత్రి కాల్పులు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఈ మధ్య రాత్రిపూట రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న ప్రయాణికుల సెల్‌ఫోన్లు, బ్యాగులు, పర్సులు, నగదు చోరీ చేస్తున్నట్టు సమాచారం అందడంతో నాంపల్లి పోలీసులు, సెంట్రల్‌జోన్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించటంతో పోలీసులు ప్రశ్నించారు. వారు తప్పించుకొనేందుకు మారణాయుధాలతో పోలీసులపై దాడికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులు ఆత్మరక్షణ కోసం వారిపై కాల్పులు జరిపారు. ఇందులో మైనర్ బాలుడి తొడకు బుల్లెట్ తగిలింది. దీంతో అతడిని ఉస్మానియా దవాఖానకు తరలించి, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నామని నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు తెలిపారు. మల్లేపల్లి మాంగార్‌బస్తీకి చెందిన వారిద్దరు అనేక కేసుల్లో నిందితులుగా ఉన్నారని వెల్లడించారు. దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.



రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులపై దాడికి నిందితులు ఉపయోగించిన గొడ్డలి



కోస్గి ప్రభుత్వ దవాఖానలో బైఠాయించిన బీఆర్‌ఎస్ నేతలు

సీఎం ఇలాకాలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- కోస్గి ప్రభుత్వ దవాఖానలో రోగులను పట్టించుకోని వైనం
- రోగికి సెలైన్ పెట్టిన వాచ్‌మన్.. బీఆర్‌ఎస్ నేతల ఆందోళన

నారాయణపేట (కోస్గి), జూలై 12: సీఎం ఇలాకాలో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నేత శాసం రామకృష్ణ కొడుకు అస్వస్థతకు గురయ్యాడు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది ఎవరూ బాలుడిని పరీక్షించలేదు. వాచ్‌మన్ మాత్రం సెలైన్ ఎక్కించాడు. వైద్యులు ఎవరూ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రామకృష్ణ, కుమారుడిని ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లాడు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం బీఆర్‌ఎస్ నాయకులు వెంకటనర్సింహులు, హన్మంత్, తాయప్పతోపాటు పలువురితో దవాఖానకు చేరుకొని బైఠాయించారు. రెండు గంటల ఆందోళన చేపట్టగా దవాఖాన ఇన్‌చార్జి డాక్టర్ అనుదీప్ వచ్చి విషయం తెలుసుకొని నైట్‌డ్యూటీలో ఉన్న డాక్టర్, నర్సులు, సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రామకృష్ణ ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు చైతన్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



నిండు గర్భిణీ నడవాల్సిందే!

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం గొరాపూర్ పరిధిలోని చిత్తబట్టా గ్రామంలో గర్భిణీ పంద్ర శ్రీదేవికి నెలలు నిండాయి. ప్రసవం కోసం ఉట్నూర్ సర్కారు దవాఖానకు తీసుకెళ్లడానికి ఆశ కార్యకర్త లక్ష్మి గ్రామానికి వచ్చారు. చిత్తబట్టా నుంచి గొరాపూర్ వరకు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడం, మధ్యలో వాగు ఉండటంతో అంబులెన్స్ రావడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో గర్భిణీ శ్రీదేవి గొరాపూర్ వరకు కిలోమీటర్ దూరం కాలినడకన వెళ్లింది. అక్కడి నుంచి ఆశ కార్యకర్తతో కలిసి ఇంద్రవెల్లికి ఆటోలో వెళ్లకున్నది. - ఆదిలాబాద్

రేషన్ బియ్యం కోసం వెళ్లి మృతి

- 3 కిలోమీటర్లు నడిచి ప్రాణాలొదిలిన వృద్ధురాలు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలలో విషాదం

జయశంకర్ భూపాలపల్లి, జూలై 12 (నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యం కోసం ఇంటి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపునకు నడిచి వెళ్లి వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని పలిమెలలో జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం బోడాయిగూడెంకి చెందిన కావుల పోషక్క (65) రేషన్ బియ్యం కోసం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలిమెలకు నడిచి వెళ్లింది. దాహం వేయడంతో రేషన్ షాపు పక్కనే ఉన్న ఇంటి వద్ద కూర్చుని నీళ్లు తాగి కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వాళ్లు వచ్చి ఆమెను దవాఖానకు తరలించేలోపే మృతి చెందింది. గ్రామస్థులు వృద్ధురాలి మృతదేహాన్ని బోడాయిగూడేనికి తరలించారు. పోషక్క కొన్నేండ్ల క్రితం పంకెన గ్రామం నుంచి పలిమెలకు వలస వచ్చి తన అక్క వద్దన ఉంటున్నది. ఆమెకు దగ్గరి బంధువులు ఎవరూ లేరని, అంత్యక్రియలు చేయడానికి సైతం డబ్బు లేని పరిస్థితి అని తెలిపారు.

చేరినచోటే పాతుకుపోయారు!

- డీఎంఈలో దశాబ్దాలుగా 'బదిలీ' ఎరుగని డాక్టర్లు
- ఒకే మెడికల్ కాలేజీలో తిష్టవేసిన బోధన సిబ్బంది
- దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారి జాబితా విడుదల

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు దశాబ్దాలుగా అక్కడే తిష్టవేశారు. కనీసం పక్క దవాఖానకు కూడా బదిలీ కాకుండా.. చేరిన చోటే పాతుకుపోయారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా డీఎంఈ పరిధిలో దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్నవారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆ జాబితాలో అనేక మంది ప్రొఫెసర్లు దశాబ్దాలుగా హైదరాబాద్‌కే పరిమితం అయినట్టు స్పష్టం అవుతున్నది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ దవాఖానల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరి అసోసియేట్ ప్రొఫెసర్లుగా, ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినా అక్కడే పాతుకుపోయిన వారు వందల సంఖ్యలో ఉండటం గమనార్హం. దీంతో తమకు అన్యాయం జరుగుతున్నదని ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్నిసార్లు బదిలీలు చేపట్టినా పైరవీలు చేయించుకొని అక్కడే ఉండిపోతున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు తమ భార్య/భర్త హైదరాబాద్‌లో పనిచేస్తున్నారని కారణాలు చెప్తున్నారని, మరికొందరు తాము స్పెషాలిటీ వైద్యులమని, ఇతర ప్రాంతాలకు పంపితే అక్కడ ఈ సేవలు అందించే వెసులుబాటు లేదనే సాకులుచూపుతున్నారని చెప్తున్నారు. సంఘాల పేర్లు చెప్పుకొని, కూర్చున్న సీట్లోనే దశాబ్దాలుగా కొనసాగుతున్నవారు ఎంతోమంది ఉన్నారని పేర్కొంటున్నారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంటూ ప్రైవేట్ ప్రాక్టీస్ కూడా చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, వీరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయటం ఎవరి తరం కావటం లేదన్న అభిప్రాయం వైద్యవర్గాల్లో బలపడిపోయింది. వారు హైదరాబాద్‌కే పరిమితం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న నిపుణులకు నగరానికి వచ్చి, అత్యాధునిక వసతుల మధ్య చికిత్స అందించే అవకాశం లేకుండా పోతున్నదనే అభిప్రాయం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో నాలుగేండ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్నవారిలో 276 మంది ప్రొఫెసర్లు ఉన్నారు. వీరిలో 40 శాతం చొప్పున అంటే 198 మందిని బదిలీ చేయాల్సి ఉన్నది. గతంలో మెడికల్ కాలేజీల సంఖ్య తక్కువగా ఉన్నది కాబట్టి వాళ్లు అక్కడే తిష్టవేసినా పెద్దగా పట్టించుకోలేదని, ఇప్పుడు మెడికల్ కాలేజీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈ ప్రభుత్వమైనా మార్పు తుందా? అని గ్రామీణ ప్రాంతాల్లోని డాక్టర్లు ఎదురుచూస్తున్నారు.

- ఉస్మానియా దవాఖానలో స్పెషాలిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కిరణ్మయి ఇస్మాయిల్ 32 ఏండ్లుగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 1992లో ఉద్యోగంలో చేరగా, పక్క హాస్పిటల్‌కు కూడా మారలేదు.
- గాంధీ దవాఖానకు చెందిన కార్డియాలజీ ప్రొఫెసర్ నితిన్‌కుమార్ 1994లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరగా, 30 ఏండ్లుగా అదే దవాఖానకు పరిమితమయ్యారు.
- నిలోఫర్ దవాఖానకు చెందిన అనస్థీషియా ప్రొఫెసర్ సాదనాయ్ 26 ఏండ్లుగా అక్కడి నుంచి కదలలేదు.
- ఉస్మానియాలో గ్యాస్ట్రో ఎంటరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వాసిఫ్ అలీ 1994లో ఉద్యోగంలో చేరగా, 30 ఏండ్లుగా అక్కడే కొనసాగుతున్నారు.
- గాంధీ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మునీశర్ 25 ఏండ్లుగా అదే దవాఖానకు పరిమితమయ్యారు.

కరెంటు షాక్‌తో ప్రైవేట్ కార్మికుడి మృతి

- విద్యుత్తు సిబ్బందిపై గ్రామస్థుల దాడి
- కుటుంబానికి ఆదుకోవాలని ధర్నా
- 6 గంటలు స్తంభంపైనే మృతదేహం
- జనగామ జిల్లా వనపర్తిలో ఉద్రిక్తత

లింగాలఘనపురం, జూలై 12: కరెంటు షాక్ తగిలి ఓ ప్రైవేట్ విద్యుత్తు కార్మికుడు స్తంభంపైనే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వనపర్తిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి గ్రామంలో విద్యుత్తు సరఫరాలో తలెత్తిన లోపాన్ని సరిచేసేందుకు జేఎల్‌ఎం సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో మేరకు సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవి వనపర్తి ఫీడర్‌లో కరెంటు సరఫరాను నిలిపివేశారు. ప్రైవేట్ కార్మికుడు కుక్కల మల్లేశ్ (35) గ్రామంలోని కరెంటు స్తంభాన్ని ఎక్కి లోపాన్ని సరిచేస్తుండగా.. మళ్లీఒక్కసారిగా ఫీడర్‌లో విద్యుత్తు సరఫరా ఉండటంతో మల్లేశ్ విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే ప్రాణాలు వదిలాడు. సిబ్బంది అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే మల్లేశ్ మృతి చెందాడని గ్రామస్థులు తీవ్రఆగ్రహానికి గురయ్యారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసేవరకు మృతదేహాన్ని తరలించొద్దని అడ్డుకున్నారు. విద్యుత్తు సిబ్బందిపై దాడికి దిగి నిరసన చేపట్టారు. ఆరు గంటలపాటు మృతదేహం స్తంభంపైనే ఉండిపోయింది. స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ పోలీస్ సిబ్బందితో వనపర్తికి చేరుకొని విద్యుత్తు అధికారులు, గ్రామస్థులతో చర్చించారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పరిహారం ఇచ్చేలా ఒప్పందం కుదరడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సైలు చింత రాజు, నరేశ్‌తోపాటు డీసీఆర్‌లోని పోలీసులు గ్రామంలోకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. మృతుడికి భార్య భాగ్యమ్మ, కూతురు శ్రుతి, కుమారుడు చరణ్ ఉన్నారు.



విద్యుత్ స్తంభంపై మల్లేశ్ మృతదేహం

చిట్టీల వ్యాపారి వేధింపులు.. వాచ్‌మన్ ఆత్మహత్య

ప్రగతినగర్‌లో కరెంటువైరు పట్టుకుని బలవన్మరణం

మూసాపేట, జూలై12: చిట్టీల వ్యాపారి వేధింపులతో మనస్తాపం చెంది ఓ వాచ్‌మన్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. కూకట్‌పల్లి సీఐ ముత్తు, ఎస్సై ప్రేమ్‌సాగర్ కథనం ప్రకారం.. మూసాపేట ప్రగతినగర్‌లోని శ్రీసాయికృష్ణ క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కనకరాజు కుటుంబంతో అందులోనే ఉంటున్నాడు. అపార్ట్‌మెంట్‌లో ఉండే చిట్టీల వ్యాపారి ఉపేందర్ వద్ద కనకరాజు చిట్టీ వేశాడు. కొన్ని రోజులుగా చిట్టీ డబ్బులు కట్టకపోవడంతో ఈనెల 11న రాత్రి కనకరాజుతో ఉపేందర్ భర్త గొడవ పడ్డాడు. మనస్తాపం చెందిన కనకరాజు శుక్రవారం అపార్ట్‌మెంట్‌లోని పార్కింగ్ స్థలంలో మెయిన్ పవర్ బోర్డ్ విద్యుత్తు వైరు పట్టుకొని చనిపోయాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

- సరైన పరిహారం కోసం రైతుల రిలే దీక్ష



కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు చేపట్టనున్న కాళేశ్వరం కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన బాటపట్టారు. శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే దీక్షకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించాలని, భూమికి బదులు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీముద్దీన్, నాయకులు చంద్రశేఖర్, భిక్షపతి, మైనయ్యయాదవ్ పాల్గొన్నారు. - నర్సాపూర్

మేడిగడ్డపై తుది నివేదిక ఇవ్వండి

మేడిగడ్డపై తుది నివేదిక ఇవ్వండి

హైదరాబాద్, జూలై12 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌కు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై తుది నివేదిక ఇవ్వాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకు సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు. జలసౌధలో జరిగిన ఉన్నతాధికారులు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు చేపట్టిన పనులు, పరీక్షలు, ఎదురైన అడ్డంకులను ఈఎన్సీ బీ నాగేందర్‌రావు, రామగుండం ఈఎన్సీ సుధాకర్‌రెడ్డి వివరించారు. సమావేశంలో ఆయా సంస్థలకు చెందిన అధికారులు అమితాబ్ మీనా, మనీశ్‌గుప్తా, డాక్టర్ మందిర, సీఈసీడీవో మోహన్‌కుమార్, సీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు ఎందుకిచ్చారు..?

ఉద్యోగ విరమణ పొందిన అధికారుల స్థానంలో ఇతర అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ జారీ చేసిన ఉత్తర్వులపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ అధికారులకు అదనపు బాధ్యతలు ఎలా అప్పగించారో తెలియజేయాలని వివరణ కోరింది. ఈ మేరకు ఈఎన్సీ జనరల్‌కు మెమో జారీ చేసింది.

నెలాఖరున జీఆర్‌ఎంబీ సమావేశం

సీతారామ ప్రాజెక్టు అనుమతులపై చర్చ

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ) సమావేశాన్ని ఈ నెలాఖరున నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఇరు రాష్ట్రాలకు బోర్డు సమాచారం అందించింది. ఇటీవలే సీతారామ డీపీఆర్‌కు సంబంధించిన డీపీఆర్‌ను జీఆర్‌ఎంబీకి సీడబ్ల్యూసీ పంపించింది. ఈ నేపథ్యంలో డీపీఆర్‌పై ఇరు రాష్ట్రాలతో చర్చించేందుకు ఈ నెలాఖరున సమావేశం నిర్వహించాలని బోర్డు నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికుల ఆందోళన



చేయూత పథకం కింద రూ.4 వేల జీవనభృతిని రేవంత్ సర్కార్ వెంటనే చెల్లించాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపట్టారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జవుల రాములు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. - సిరిసిల్ల కలెక్టరేట్

'రైతుల సమస్యలు పరిష్కరించాలి'

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రైతుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర రైతు సంఘం కోరింది. శుక్రవారం ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, సహాయ కార్యదర్శి శోభన్, సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కోరారు.

'టీ-స్క్వేర్'కు టెండర్లు

బిడ్లకు ఆగస్టు 9 దాకా గడువు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాయదుర్గం, బయోడైవర్సిటీ ప్రాంతాల్లో టీ-స్క్వేర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తున్నది. బిడ్లకు ఆగస్టు 9 వరకు గడువు విధించింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం ఆర్కిటెక్చరల్, డాటాదేటిల సలహాల సేవల కోసం టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. అమెరికాలోని న్యూయార్క్ సిటీలో ప్రఖ్యాతిగాంచిన టైమ్స్‌స్క్వేర్ తరహా టీ-స్క్వేర్ నిర్మించాలని యోచిస్తున్నది. హైదరాబాద్‌కు ఐకానిక్‌గా టీ-స్క్వేర్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నది.

'కులగణన బిల్లు కోసం ఢిల్లీ యాత్ర'

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వమే కులగణన చేపట్టాలని, ఈ మేరకు రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా బీసీ ఎంపీలంతా కృషి చేయాలని ఓబీసీ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పురుషోత్తంగౌడ్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణన బిల్లు సాధనకు త్వరలో ఢిల్లీ యాత్ర చేపట్టనున్నట్టు వెల్లడించారు.

అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌గా జీవీ నారాయణరావు



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన గుమ్మడి వెంకటనారాయణ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి ఇతర ఉన్నతాధికారులు వెంకటనారాయణరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

క్యాన్సర్ మందులపై అధిక ధరలు

ఫార్మా కంపెనీపై కేసు నమోదు

కరీంనగర్ విద్యానగర్, జూలై 12: క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన డెకర్స్ జాయిన్ 500 ఎంజీ 23 వాయిల్స్‌పై ఎమ్మార్పీ కంటే అధిక ధర ఉన్నట్టు గుర్తించి సంబంధిత ఫార్మా కంపెనీపై కేసు నమోదు చేసినట్టు కరీంనగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ తెలిపారు. డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డీపీసీవో) ప్రకారం ఎమ్మార్పీ రూ.518 కాగా, వాటిపై రూ.1,250 ఉన్నట్టు గుర్తించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కరీంనగర్‌లోని ఓ ఏజెన్సీలో శుక్రవారం తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం బయటపడిందని, సంబంధిత ఫార్మాస్యూటికల్ కంపెనీపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు.

19 మంది జీపీల నియామకం

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): హైకోర్టులో 19 మందిని ప్రభుత్వ న్యాయవాదులుగా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి పేరిట జీవో 399 వెలువడింది. వీరంతా మూడేండ్లపాటు ఆ పదవుల్లో కొనసాగుతారని స్పష్టం చేసింది.

కవిత డిఫాల్ట్ బెయిల్‌పై 22న విచారణ

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానంపై సీబీఐ నమోదు చేసిన కేసులో తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలంటూ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను రౌస్ ఎవెన్యూ కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశం, కవిత దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై ఈనెల 22న విచారణ చేపడ్తామని న్యాయస్థానం తెలిపింది.

ఇట్లయితే వాస్తవాలు తెలుస్తయా?

- కాంగ్రెస్ అభ్యర్థులపై 'కురియన్' అసహనం
- కూడబలుక్కున్నట్టు ఓడిన, గెలిచిన వారిది అదేమాట
- భయపడ్డారా..? లేదా అధినేతను కాపాడుతున్నారా?
- మంత్రిపదవులివ్వనందునే ఓడామన్న మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఎంఐఎంతో దోస్తీ కొంపముంచిందన్న ఫిరోజ్‌ఖాన్
- పర్యటనను అర్ధాంతరంగా ముగించిన కమిటీ



హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలకు కారణాలు తెలుసుకునేందుకు వచ్చిన కురియన్ కమిటీ పర్యటన అర్ధాంతరంగా ముగిసింది. మూడు రోజుల పర్యటనను రెండు రోజులకే కుదించుకొని శుక్రవారం తిరిగి వెళ్లిపోయింది. కమిటీకి నేతృత్వం వహించిన పీజే కురియన్ శుక్రవారం ఉదయం కేరళకు వెళ్లిపోగా, మిగతా ఇద్దరు సభ్యులు సాయంత్రం నాలుగు గంటల వరకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ముందు హాజరైన ఓడిపోయిన ఎంపీ అభ్యర్థులు, గెలిచిన ఎంపీలు ఒకేలా రాసిచ్చిన స్క్రిప్ట్ మాదిరిగా బీఆర్‌ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకి మళ్లడం వల్లనే ఓడిపోయామని చెప్పడం పట్ల కురియన్ పెదవి విరిచిన విషయం తెలిసిందే. 'ఇలా అయితే వాస్తవాలెలా బయటికి వస్తాయి. మమ్మల్ని కలువడానికి ముందు మీరంతా ఒకే విధంగా చెప్పాలని నిర్ణయించుకున్నారా? అని ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రెండో రోజు కూడా అవే కారణాలనే చెప్పినట్టు తెలిసింది. దీంతో ఇక ఫలితం లేదని భావించిన మిగతా ఇద్దరు సభ్యులు కూడా శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి తిరిగి వెళ్లిపోయారు. తమ నివేదికను ఈ నెల 21న అధిష్ఠానానికి అందించనున్నట్టు కురియన్ కమిటీ సభ్యుడు రికాబుల్ హసన్ మీడియాకు తెలిపారు. ఇంకా ఎవరైనా ఏమైనా చెప్పాలనుకుంటే ఫోన్ చేసి కానీ, రాతపూర్వకంగా గానీ పంపవచ్చని వారు సూచించినట్టు తెలిసింది. వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

అప్పుడు అలా చెప్పారు!

అధికారంలో ఉండి కూడా మెజార్టీ ఎంపీ సీట్లు గెలువలేకపోవడానికి అభ్యర్థుల ఎంపిక సరిగ్గా జరగలేదని, ఇతర పార్టీలకు చెందిన నేతలను ఎన్నికలకు ముందే పార్టీలో చేర్చుకొని బరిలోకి దింపారని, నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు గెలిచే విధంగా బలహీనమైన అభ్యర్థులను ఎంపిక చేశారని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిపై రాష్ట్ర నేతలు అధిష్ఠానానికి ఉప్పు అందించారు. ఇందులో నిజానిజాలను తేల్చేందుకే ఏఐసీసీ కురియన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రానికి పంపింది. కానీ కమిటీ ముందు హాజరైన వారంతా పై కారణాల్లో ఒక్కటీ చెప్పలేదు. దీంతో వారు రాష్ట్ర నాయకత్వానికి భయపడ్డారా? లేక తమ నాయకుడిని కాపాడుకున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పదవులు లేకపోవడమే కారణం: మల్‌రెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని చేవెళ్ల, మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలువలేకపోవడానికి మంత్రివర్గంలో ఈ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడమే కారణమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కమిటీకి వివరించినట్టు మీడియాకు తెలిపారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఇక్కడ ఎంపీ సీట్లు గెలువలేకపోయామని ఆయన వివరించారు.

ఒప్పందమే కొంపముంచింది : ఫిరోజ్‌ఖాన్

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ లోపాయకారి పొత్తు పెట్టుకోవడంతో హిందూ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గుచూపారని నాంపల్లి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన ఫిరోజ్‌ఖాన్.. భిన్నమైన వాదన వినిపించినట్టు తెలిసింది. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ఇదే కారణమని ఆయన ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సూచన మేరకు హైదరాబాద్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దింపిందని, తనకు అక్కడి నుంచి టికెట్ ఇచ్చి ఉంటే కచ్చితంగా గెలిచేవాడినని కూడా ఫిరోజ్‌ఖాన్ చెప్పినట్టు తెలిసింది.

దానంపై అనర్హతకు మరో పిటిషన్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసే విధంగా స్పీకర్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. నిర్మల్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే ఏ మహేశ్వర్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లు హైకోర్టు విచారణలో ఉన్నాయి. తాజా పిటిషన్‌పై కూడా హైకోర్టు సోమవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

- **కాంగ్రెస్‌లో చేరిన ప్రకాశ్‌గౌడ్**



రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పీ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

- **కార్పొరేషన్ చైర్మన్ల బాధ్యతలు..**



రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లకు చైర్మన్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల కళాభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు ఆమెకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో, రాష్ట్ర షెడ్యూల్ కులాల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా ఎన్ ప్రీతమ్ మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్‌ఎస్ భవన్‌లో బాధ్యతలు చేపట్టారు.

దవాఖానకు బక్క జడ్సన్ తరలింపు

ఆరోగ్యం క్షీణించడంతో స్పందించిన ఉద్యమకారులు



జడ్సన్‌ను తరలిస్తున్న రజినీ, ఉద్యమకారులు

ముషీరాబాద్, జూలై 12: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం సాయంత్రం దవాఖానకు తరలించారు. కదలలేని స్థితికి చేరుకోవడంతో కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్ సహా పలువురు తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు అంబులెన్స్‌ను రప్పించి తరలించేందుకు చొరవ తీసుకున్నారు. మొదట నల్లకుంట ఆంధ్ర మహిళాసభ, అక్కడి నుంచి నిమ్స్ దవాఖానకు తరలించారు. గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని తన నివాసంలో బక్క జడ్సన్ వారం రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. శుక్రవారం జడ్సన్‌ను పరామర్శించడానికి వచ్చిన వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్, పలువురు ఉద్యమకారులు ఆయన పరిస్థితిని చూసి చలించిపోయారు. వెంటనే దవాఖానకు తరలించారు.

ఇంత దారుణమా?: రజినీ సాయిచంద్

ప్రజాపాలనలో ఇంత దారుణమా, ప్రభుత్వం బేషజాలకు పోయి జడ్సన్ దీక్షను నిర్లక్ష్యం చేసిందని రజినీ సాయిచంద్ మండిపడ్డారు. ఒకవైపు జడ్సన్ తనను దవాఖానకు తీసుకుపోవద్దని వారిస్తున్నా.. రజినీ సాయిచంద్ ఆయన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా తరలించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా అపార్టుమెంటు బయట ఉన్న పోలీసుల ఎదుట ఆమె అసహనాన్ని వ్యక్తం చేశారు.

నిమ్స్ దవాఖాన వద్ద ఉద్రిక్తం

ఖైరతాబాద్, జూలై 12: బక్క జడ్సన్‌ను చేర్చుకునేందుకు నిమ్స్ వైద్యులు తొలుత నిరాకరించారు. బెడ్లు ఖాళీ లేవని, చేర్చుకోవడం కుదరదని తేల్చిచెప్పారు. ఈ దశలో నిరుద్యోగులు, అభిమానులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వారి ఒత్తిడి మేరకు ఆయనను ఎమర్జెన్సీ వార్డులో చేర్చుకున్నారు. సుమారు 30 నిమిషాలకు పైగా జడ్సన్‌ను అంబులెన్స్‌లోనే ఉంచడంతో దవాఖాన బయట తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. అనంతరం వైద్యులు చేర్చుకోవడంతో ఆందోళనను విరమించారు. అంతకు ముందు వేర్వేరు దవాఖానలకు తరలించగా, బెడ్స్ లేవని జడ్సన్‌ను చేర్చుకోలేదు. ప్రస్తుతం జడ్సన్‌కు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నామని, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు దవాఖాన ఆర్‌ఎంవో తెలిపారు.

సీఎం సారూ అన్యాయం చేస్తారా?

- గత రెండుసార్లు ఎంపిక అయ్యా.. ఈసారి కోల్పోయా
- మానసిక వ్యథతో లేఖ రాసిన నిరుద్యోగి కవిత

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ కోసం మూడుసార్లు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో రెండుసార్లు అర్హత సాధించా. ఈ ఏడాదిలో మూడోసారి నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించకపోవడంతో నాకు అన్యాయం జరిగింది. నాలాంటోళ్లకు అన్యాయం చేస్తారా' అని కవిత అనే ఓ నిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి, టీజీపీఎస్సీ సెక్రటరీకి ఆమె లేఖ రాసింది. పాత గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ద్వారా పరీక్ష పెట్టడం వల్లే తాను మెయిన్స్ జాబితాలో అవకాశం కోల్పోవాల్సి వచ్చింది.. అని కవిత ఆ లేఖలో పేర్కొన్నది. అయితే ఈ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని పూడ్చడానికి మానవతా కోణంలో ఆలోచించి 1:100 నిష్పత్తిని పాటించాలని కోరుతున్నది. రెండున్నరేండ్లుగా తీవ్ర మానసిక వేదనతో ఉన్నా.. అందువల్లే మూడోసారి పరీక్షల్లో అర్హత సాధించలేకపోయా' అని ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. 'నాకు జీవితం పట్ల ఆశలు పడుతూ వాల్సిన పరిస్థితులను తీసుకొచ్చిన ప్రభుత్వ పనితీరుకు నేను బలి కావాల్సి వస్తున్నది' అని పేర్కొన్నది. కనీసం మెయిన్స్ పరీక్షలు రాసి ఫెయిలైనా ఏదో సర్దిచెప్పుకునే వాళ్లమని, ఆ అవకాశం కూడా లేదు.. అని ఆవేదన వ్యక్తం చేసింది.



నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గురుకులంలో విద్యార్థులు పడుకునే గది

ఎలుకల కలకలం

> మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని అల్లూరి సీతా...


మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గురుకులంలోనూ విద్యార్థులను కరిచాయి. నర్సాపూర్ పట్టణ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులంలో విద్యనభ్యసిస్తున్న నలుగురిని శుక్రవారం ఎలుకలు కరిచాయని విద్యార్థులు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు రాకుండా.. విద్యార్థులతో విలేకరులు మాట్లాడకుండా గురుకుల సిబ్బంది అడ్డుపడ్డారు. గదిలో చెత్తాచెదారం ఉండటంతో రోజూ ఎలుకలు వస్తున్నాయని కొందరు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు ఏఎన్‌ఎంతో ప్రథమ చికిత్స చేయించారని సమాచారం. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా.. అలాంటి సంఘటన ఏమీ జరగలేదని చెప్పడం విశేషం.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రామాయంపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలను ఎలుకలు కొరికిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌కు మెదక్ మాజీ ఎమ్మెల్యే పి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. శుక్రవారం సచివాలయంలో శ్రీధర్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.

హాస్టల్‌లో మేముండలేం!

- గోడ దూకి 19 మంది పరార్
- అర్ధరాత్రి కాలినడకన జనగామకు చేరుకున్న విద్యార్థులు
- పెంబర్తి మహాత్మాజ్యోతిబాపూలే హాస్టల్‌లో ఘటన



హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జనగామ రూరల్, జూలై 12: సీనియర్ విద్యార్థులు, ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక కొందరు విద్యార్థులు అర్ధరాత్రి హాస్టల్ గోడదూకి పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా జనగామ మండలం పెంబర్తిలోని మహాత్మాజ్యోతిబాపూలే హాస్టల్‌లో జరిగింది. ఇక్కడి హాస్టల్‌లో ఉంటున్న 19 మంది విద్యార్థులు.. వసతులు సరిగ్గా లేక, సిబ్బంది వేధింపులు తట్టుకోలేక అర్ధరాత్రి హాస్టల్ గోడదూకి జనగామ ధర్మకంచలో ఉన్న పాత హాస్టల్‌కు సుమారు ఆరు కిలోమీటర్లు కాలినడకన చేరుకున్నారు. అర్ధరాత్రి విద్యార్థులు హాస్టల్ నుంచి వెళ్లిపోతే.. సిబ్బంది కనీసం సమాచారం ఇవ్వలేదని మధ్యాహ్నం ధర్మకంచలోని హాస్టల్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పెంబర్తిలోని జ్యోతిబాపూలే పాఠశాలలో సరైన సౌకర్యాలు లేవని, ఇక్కడ ఉండటానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. సీనియర్ విద్యార్థులు, టీచర్లు వేధిస్తున్నారని, సౌకర్యాలు లేవని అడిగితే ఇక్కడ ఇలాగే ఉంటుందని బెదిరిస్తున్నారని వాపోయారు. జనగామలోని ధర్మకంచ హాస్టల్‌లో సౌకర్యాలు ఉన్నాయని, ఇక్కడి నుంచి పెంబర్తి హాస్టల్‌కు మార్చారని పేర్కొన్నారు. గతంలో ఉన్న హాస్టల్‌లోనే ఉంటామని విద్యార్థులు నినాదాలు చేశారు. అధికారులు స్పందించి ధర్మకంచ హాస్టల్‌లో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. రాయడేని బాపులో ఉపాధ్యాయులు బూతులు తిడుతున్నారని చెప్పారు. పెంబర్తి హాస్టల్‌లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలున్నాయని ప్రిన్సిపాల్ అనిత పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగొద్దనే పెంబర్తిలో మరో బిల్డింగ్ అద్దెకు తీసుకున్నామని, బూతులు తిట్టే ఉపాధ్యాయులపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె వివరించారు.

మహిళా సంఘాలకు గురుకులాల కిచెన్!

- బాధ్యతల అప్పగింతకు ప్రభుత్వం యోచన
- ముందుకొస్తే టెండర్లు లేకుండానే ఇచ్చేందుకు సిద్ధం
- శానిటేషన్ కోసం ఆర్సీవోల పరిధిలో రెస్క్యూ బృందాలు
- ఫిర్యాదుల కోసం ప్రతి గురుకులంలో ఫోన్ ఏర్పాటు
- 20వ తేదీలోగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి: సెక్రటరీ వర్షిణి

హైదరాబాద్, జూలై12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గురుకులాల నిర్వహణ బాధ్యతను స్థానిక స్వయం సహాయక సంఘాలకు అప్పగించే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నది. తొలుత తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) పరిధిలోని గురుకులాల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని భావిస్తున్నది. సొసైటీల పరిధిలో పరిశుభ్రత చర్యల కోసం ఆర్సీవోల పరిధిలో ప్రత్యేకంగా శానిటేషన్ రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్‌పైనా దృష్టి సారించనున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఆయా వివరాలను వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు, ఆ బాధ్యతలను స్థానిక సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు అప్పగించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘాలు ముందుకొస్తే గురుకులాల నిర్వహణ బాధ్యతను టెండర్లు లేకుండానే నేరుగా అప్పగిస్తామని తెలిపారు. గురుకుల విద్యార్థులకు అందించే కాస్మోటిక్స్ నిధులు, బిల్లులను కూడా గ్రీన్ చానల్ పద్ధతిలో చెల్లిస్తామని తెలిపారు. శానిటేషన్ బృందంలో ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పెస్ట్ కంట్రోల్ తదితర విభాగాలకు చెందిన నిపుణులు ఉంటారని తెలిపారు. ఆర్సీవో పరిధిలోని గురుకులాల్లో శానిటేషన్ పనులన్నీ ఆ బృందాలే పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. గురుకుల విద్యార్థులు తమ సమస్యలను వివరించేందుకు సొసైటీ ప్రధాన కార్యాలయంతో అనుసంధానిస్తూ త్వరలోనే పైలట్ ప్రాజెక్టుగా 10 గురుకులాల్లో ఒక టెలిఫోన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆ తరువాత దానిని అన్ని గురుకులాలకు విస్తరిస్తామని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 20లోగా పూర్తి చేయనున్నట్టు సెక్రటరీ వర్షిణి స్పష్టం చేశారు. 15 నుంచి 18 వరకు గురుకుల ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని, ఆ తర్వాత 19-20వ తేదీల్లో కొత్తగా అపాయింట్‌మెంట్ అందుకున్న అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇస్తామని వెల్లడించారు. సమావేశంలో సొసైటీ అడిషనల్ సెక్రటరీ హన్మంత్‌నాయక్, జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

నార్నూర్ గురుకులంలో 20మంది విద్యార్థులకు అస్వస్థత

శ్వాస సంబంధిత సమస్యతో సతమతం • నలుగురి పరిస్థితి విషమం

నార్నూర్, జూలై 12: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ, ఆదర్శ పాఠశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. శ్వాసకోశ సమస్యతో ఇబ్బంది పడుతూ దవాఖాన పాలయ్యారు. గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా సంఘాలు, పార్టీల నాయకులు దవాఖానకు ఎదుట నిరసన తెలిపారు. స్టాఫ్ నర్సు సరితా విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. అందులో నలుగురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండటంతో ఉట్నూర్ దవాఖానకు తరలించారు.

పసికందు విక్రయం

ముగ్గురు నిందితుల అరెస్ట్.. తండ్రే సూత్రధారి

చార్మినార్, జూలై 12: కనికరం లేకుండా కన్నబిడ్డను అమ్మకానికి పెట్టాడో తండ్రి. హైదరాబాద్ బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ శుక్రవారం వివరాలను వెల్లడించారు. మెహమ్మద్‌నగర్ వాసులైన ఆసిఫ్, అస్మాబేగం దంపతులకు ఇటీవలే ఓ పాప జన్మించింది. చిన్నారిని ఎలాగైనా అమ్మి సొమ్ము చేసుకోవాలని తండ్రి ఆసిఫ్ నిర్ణయించుకున్నాడు. అదే ప్రాంతానికి చెందిన చాంద్ సుల్తానాను సంప్రదించాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మినాల్ సాదీకు సంప్రదించి లక్ష రూపాయలకు ఆ పసికందును కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అస్మాబేగంను భయపెట్టి చిన్నారిని మినాల్ సాదీకు ఆసిఫ్ అప్పగించాడు. జరిగిన ఉదంతంపై అస్మాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు చిన్నారిని రక్షించి నగరానికి తీసుకొచ్చారు. ఆసిఫ్, చాంద్ సుల్తానా, మినాల్‌సాదీను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పెద్దేముల్, జూలై 12: వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి తండా ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 33 మంది విద్యార్థులు ఉండగా, శుక్రవారం 31 మంది హాజరయ్యారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పులిహోరను వడ్డించారు. 18 మందికి ఒక్కసారిగా కడుపునొప్పి వచ్చి వాంతులయ్యాయి. విద్యార్థులకు తాండూరులోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చికిత్సను అందించగా 14 మంది కోలుకున్నారు. నలుగురు విద్యార్థులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఫుడ్ పాయిజనే అస్వస్థతకు కారణమని వైద్యులు తెలిపారు.

- **డీజీపీకి టీఎన్జీవోల శుభాకాంక్షలు**



డీజీపీ జితేందర్‌కు టీఎన్జీవో కేంద్ర సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ముజీబ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, నగరశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, మల్లారెడ్డి, శ్రీనివాస్ కలిశారు. - హైదరాబాద్

ఫిబ్రవరిలో గేట్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): జాతీయ స్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్) -2025 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో 30 పేపర్లకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు చివరివారంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఐఐటీ రూర్కీకి అప్పగించారు. వివరాలకు https://gate2025.iitr.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులివ్వండి: తపస్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) నిబంధనల మార్పు, టీఈటీ అర్హత గల ఎస్జీటీలకు ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కోరింది. శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను తపస్ ప్రతినిధి బృందం కలిసి వారికి వినతిపత్రాన్ని సమర్పించింది.

18 వరకు 'దోస్త్' రిపోర్టింగ్ గడువు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కాలేజీల్లో రిపోర్టింగ్ గడువును అధికారులు 18 వరకు పొడిగించారు. మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో ప్రత్యక్షంగా రిపోర్ట్ చేయాలని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు.

'ఎప్‌సెట్' వెరిఫికేషన్‌కు నేడే ఆఖరు

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు శనివారంతో ముగియనుంది. 15 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశముంది. శుక్రవారం వరకు 90,170 మంది ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 19 లోపు సీట్లను కేటాయిస్తారు.

ఊరట దక్కినా ఇంకా జైల్లోనే!

ఈడీ కేసులో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్

సీబీఐ కేసులో 25 వరకు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 12: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే అవినీతి ఆరోపణల కేసులో కస్టడీ పొడిగింపు వల్ల ఇంకా ఆయన జైల్లోనే ఉండాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సీఎంగా కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని కేజ్రీవాల్‌కే వదిలివేస్తున్నామని కోర్టు తెలిపింది. మూడు నెలలకు పైగా ఆయన జైలు జీవితంతో ఇబ్బందులు పడుతున్న విషయం తమకు తెలుసని చెప్పింది. ఆయన అరెస్ట్ చట్టబద్ధతపై తలెత్తిన ప్రశ్నల విచారణను విస్తృత ధర్మాసనానికి సిఫారసు చేస్తున్నామంది. కాగా, అవినీతి ఆరోపణల కేసులో ఢిల్లీ కోర్టు ఈ నెల 25 వరకు కేజ్రీవాల్ కస్టడీని పొడిగించింది.

'ఇండియా పోస్టు' పేరుతో

ఫేక్ సందేశాలు

డాటా చోరీకి సైబర్ నేరగాళ్ల యత్నాలు

న్యూఢిల్లీ: పౌరుల వ్యక్తిగత, బ్యాంకు సంబంధిత వివరాల డాటా చోరీకి సైబర్ నేరగాళ్లు అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందులో భాగంగా 'ఇండియా పోస్టు' పేరుతో ఎస్‌ఎంఎస్ పంపుతూ డాటాను మరో మార్గానికి తరలిస్తారు. మీ పార్శిల్ వేర్‌హౌస్‌కు వచ్చిందని, చిరునామా వివరాలు ఇవ్వాలని, 48 గంటల్లోగా పూర్తి చిరునామా వివరాలు ఇవ్వాలని, లేకుంటే పార్శిల్ వెనక్కి వెళ్లిపోతుందని ఒక లింక్ పంపుతున్నారు. అయితే దీనిపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) పౌరులకు హెచ్చరికలు చేసింది. ఆ లింక్‌ను క్లిక్ చేస్తే వ్యక్తిగత సమాచారం చోరీకి గురవుతుందని, ఫోన్ యాక్సెస్ పొందుతారని పేర్కొన్నది. ఇండియా పోస్టు అలాంటి సందేశాలు, లింకులు పంపదని పీఐబీ స్పష్టం చేసింది.

గుదిబండలా గ్యారెంటీలు!

- నిధులన్నీ వాటికే ఖర్చవుతున్నాయి
- అభివృద్ధి పనులకు కేటాయింపుల్లేవు
- కర్ణాటక సీఎం సలహాదారు వ్యాఖ్యలు



బెంగళూరు, జూలై 12: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓటర్లను ఆకర్షించేందుకు కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారెంటీలు ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారుతున్నాయి. గ్యారెంటీలు అమలు చేసేందుకే సర్కారు ఖజానా ఖాళీ అవుతుండటంతో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయి. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలే బాహాటంగా అంగీకరిస్తున్నారు. తాజాగా కొప్పల్ జిల్లాలోని యెల్బర్గ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఆర్థిక సలహాదారుడు బసవరాజ్ రాయరెడ్డి తన నియోజకవర్గంలో ఒక చెరువు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి నన్ను ఆర్థిక సలహాదారుగా నియమించుకున్నారు. నేను ఆయనతో రోజూ మాట్లాడతా. ఈ పనికి(చెరువు) డబ్బులు వచ్చాయి. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పని ఇదొక్కటే. నిధులన్నీ గ్యారెంటీలే ఖాళీ చేస్తున్నాయి. రూ.60-65 వేల కోట్లు గ్యారెంటీలకు ఖర్చవుతున్నాయి. ఇది ఎంత కష్టమో నాకు తెలుసు' అంటూ వ్యాఖ్యానించారు.

పునరాలోచన చేయండి: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోయింది. అప్పటి నుంచి అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల పలువురు కాంగ్రెస్ నేతలు కూడా ఇవే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల బాగల్‌కోట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జేటీ పాటిల్ కూడా గ్యారెంటీలపై మరోసారి పునరాలోచన చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరారు. మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆ పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్ కూడా గ్యారెంటీలకు వ్యతిరేకంగా మాట్లాడారు. కాగా, రాయరెడ్డి తాజా వ్యాఖ్యలు చర్చనీయాంశం కావడంతో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ స్పందించారు. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, తాము అన్నింటినీ ఓ దారికి తీసుకొస్తున్నామని, గ్యారెంటీలను కొనసాగిస్తామని వివరణ ఇచ్చుకున్నారు.

ప్రజలపై పన్నుల మోత

ఖజానా మొత్తం గ్యారెంటీలకే ఖర్చు అవుతున్న నేపథ్యంలో ఆదాయ సమీకరణకు కాంగ్రెస్ సర్కారు ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్, పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచేసింది. బస్సు చార్జీలు కూడా పెంచే యోచనలో ఉన్నది.

ఏడాదిలో కర్ణాటకలో పన్నుల వాత ఇలా..

- పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ - 4 శాతం పెంపు
- గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్ - 15 నుంచి 30% పెంపు
- దేశీయ లిక్కర్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీ - 20 శాతం పెంపు
- బీర్లపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ - 175 నుంచి 185 శాతం పెంపు
- కొత్తగా రిజిస్టరైన రవాణా వాహనాలపై అదనపు సెస్ - 3 శాతం పెంపు
- రూ.25 లక్షల పైబడిన ఎలక్ట్రికల్ వాహనాలపై లైఫ్‌టైమ్ ట్యాక్స్ విధింపు

2054 నాటికి 170 కోట్లు

తర్వాత 12 శాతం తగ్గే అవకాశాలు

భారత జనాభాపై ఐరాస అంచనాలు



యునైటెడ్ నేషన్స్: ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా చైనాను దాటేసి భారత్ ఇప్పటికే అగ్రస్థానానికి చేరుకున్నది. 2054 నాటికి దేశ జనాభా దాదాపు 170 కోట్లకు చేరుకొంటుందని ఐక్యరాజ్యసమితి తాజాగా అంచనా వేసింది. ఆ తర్వాత 12 శాతం(దాదాపు 20 కోట్లు) తగ్గుదల ఉంటుందని, అయినప్పటికీ, ఈ శతాబ్దం అంతా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతుందని ఐరాస ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం(డీఈఎస్ఏ) 'వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్-2024' నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో జననాల రేటు తగ్గదలతో చైనాలో జనాభా భారీగా పడిపోతుందని, 2025 నాటికి 121 కోట్లకు, ఈ శతాబ్దం చివరి నాటికి ఏకంగా 63.3 కోట్లకు దిగి వస్తుందని అంచనా కట్టింది.

ప్రపంచ జనాభా పెరుగుదల

- 2024- 820 కోట్లు
- 2080- 1,030 కోట్లు(అంచనా)
- 2100- 1,020 కోట్లు(అంచనా)

భారత్ జనాభా పెరుగుదల

- 2024- 145 కోట్లు
- 2054- 170 కోట్లు(అంచనా)
- 2,100 -150 కోట్లు(అంచనా)

భారీగా తగ్గనున్న చైనా జనాభా

- 2024- 141 కోట్లు
- 2054- 121 కోట్లు(అంచనా)
- 2,100- 63.3 కోట్లు(అంచనా)

65 కోట్ల ఫీజు తిరిగి ఇచ్చేయండి

10 ప్రైవేట్ స్కూళ్లకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు

జబల్‌పూర్: ఎక్కువ తరబడి విద్యార్థుల నుంచి అధికంగా వసూలు చేసిన ఫీజును వారికి తిరిగి ఇచ్చేయాలని మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా అధికారులు 10 ప్రైవేట్ విద్యాసంస్థలను ఆదేశించారు. దర్యాప్తు ఉల్లంఘించి కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు మొత్తం ఏడు విద్యా సంవత్సరాలలో 81 వేల మంది విద్యార్థుల నుంచి 65 కోట్ల రూపాయలు అదనంగా ఫీజుల రూపంలో వసూలు చేశాయని జబల్‌పూర్ డీఈఓ ఘనశ్యామ్ సోని తెలిపారు. వీటిని ఆయా స్కూళ్లు విద్యార్థులకు తిరిగి ఇచ్చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక ఫీజుల వసూలుపై జిల్లా స్థాయి కమిటీ విద్యాసంస్థల లెక్కలను పరిశీలించింది.

'అష్ట' సూత్రాలతో క్యాన్సర్‌కు చెక్

వీటిని పాటిస్తే, ప్రతీ ఇద్దరిలో ఒకర్ని క్యాన్సర్ నుంచి కాపాడొచ్చు

అమెరికన్ క్యాన్సర్ సొసైటీ సూచనలు



ప్రపంచంలో క్యాన్సర్ భూతం

18% మొత్తం మరణాల్లో వాటా

1,00,75,000 ఏటా మరణాలు

27,600 ఒక్కరోజులో సగటు మరణాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ మహమ్మారితో ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటి మందికి పైగా మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రివెన్షన్ బెటర్ దాన్ క్యూర్' అనేది క్యాన్సర్ విషయంలో సరిగ్గా సరిపోతుందని అమెరికన్ క్యాన్సర్ సొసైటీ (ఏసీఎస్) పరిశోధకులు చెబుతున్నారు. వ్యాధి సోకిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే, వ్యాధి రాకముందే నివారణ చర్యలు ఆరంభించడం కీలకమని పేర్కొంటున్నారు. అందుకే, క్యాన్సర్ దరిచేరకుండా ఉండేందుకు 8 సూత్రాలను ఏసీఎస్ పరిశోధకులు ప్రకటించారు.

క్యాన్సర్ రాకుండా అష్ట నియమావళి



ధూమపానం వద్దు

ధూమపానం కారణంగా దాదాపు 18 రకాల క్యాన్సర్లు సోకే ప్రమాదమున్నది. ఊపిరితిత్తుల క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్ ఇందులో ప్రధానమైనవి. ధూమపానం వల్ల పొగ తాగే వారికే కాకుండా ఆ పొగను పీల్చే వారి కుటుంబసభ్యులకూ ప్రమాదమే.



వ్యాయామం లేకపోవడం

శరీరాన్ని మనసును చురుగ్గా ఉంచుకోవడానికి వ్యాయామం, యోగా వంటి సాధనలు చేయాలి. క్యాన్సర్ కట్టడిలో ఇవి కూడా కీలకపాత్ర పోషిస్తాయి.



స్థూలకాయమా? చూసుకోండి!

బరువు పెరగడమూ క్యాన్సర్ సోకడానికి ఓ కారణంగా మారింది. కొవ్వు అధికంగా చేరడం, రక్తంలో ఇన్సులిన్ స్థాయిల్లో మార్పుతో అండాశయ క్యాన్సర్, కొలొరెక్టల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నది. మహిళల్లో 11 శాతం కేసులు, పురుషుల్లో 5% కేసులు ఈ క్యాటగిరీవే.



యూవీ రేడియేషన్


అల్ట్రావయోలెట్ (యూవీ) రేడియేషన్ కారణంగా చర్మకణాల్లో డీఎన్ఏ నాశనమవుతుంది. ఇది చర్మ క్యాన్సర్‌కు కారణం కావొచ్చు. యూవీ రేడియేషన్ తగిలే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.



మద్యపానంతో ఇలా..

క్యాన్సర్ కొత్త కేసుల్లో 5.5%, మరణాల్లో 5.8% వాటా మద్యానిదే. మద్యం సేవించడం వల్ల కాలేయంతో పాటు డీఎన్ఏ కణాలు నాశనమవుతాయి. హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటుంది. ఫలితంగా నోటి క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ఉదర క్యాన్సర్ రావొచ్చు.

ఈ వైరస్‌లూ ప్రమాదమే



ఎప్‌స్టీన్-బార్ వైరస్ (ఈబీవీ), హెలికోబ్యాక్టర్ పైలోరీ, హెపటైటిస్ బీ వైరస్ (హెచ్‌బీవీ), హెపటైటిస్ సీ వైరస్ (హెచ్‌సీవీ), హెచ్‌హెచ్‌వీ-8, హెచ్ఐవీ, హెచ్‌పీవీ తదితర వైరస్‌లు బారినపడ్డ వారికి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉన్నది. ఇవి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రాసెస్డ్ మాంసం వద్దు..

మాంసం నిల్వ ఉండడానికి కొన్ని రసాయనాలను కలుపుతారు. ఇవి క్యాన్సర్ కారకాలుగా పనిచేస్తాయి. అలాంటి ప్రాసెస్డ్ ఫుడ్‌ను తీసుకోకపోవడమే మంచిది.

కూరగాయలు, పండ్లు తింటున్నారా?



ఫైబర్ ఎక్కువగా ఉండే ఆకుపచ్చని కూరగాయలు, తాజా పండ్లు, కాల్షియం లభించే ఆహారాన్ని తీసుకోవడం మరిచిపోవద్దు. వీటిని విస్మరిస్తే శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడంతో ఇమ్యూనిటీ తగ్గిపోతుంది. ఇది క్యాన్సర్ కణాల వృద్ధికి కారణమవ్వొచ్చు.



వైభవంగా అనంత్ అంబానీ - రాధిక వివాహం

ముంబై, జూలై 12: ఆసియాలోనే అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహం తన చిన్ననాటి స్నేహితురాలు రాధిక మర్చంట్‌తో వైభవంగా జరిగింది. ముంబైలో శుక్రవారం జరిగిన ఈ వేడుకకు రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. యూకే మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్, నటీనటులు జాన్ సీనా, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అజయ్ దేవగన్, రణబీర్ కపూర్, ఆలియా భట్, టైగర్ ష్రాఫ్, వరుణ్ ధావన్, రజనీకాంత్, రామ్ చరణ్, మహేశ్ బాబు, క్రీడాకారులు సచిన్ టెండూల్కర్, ధోనీ, తదితరులు వివాహ వేడుకకు హాజరయ్యారు.

సెంట్రీ విధులకే అగ్నివీర్లు!

- వారికిస్తున్నది అరకొర శిక్షణే
- సాంకేతికతను ఎక్కువగా వాడే ఎయిర్‌ఫోర్స్, నేవీకి సరిపడరు
- అగ్నిపథ్ పథకంతో యుద్ధ సన్నద్ధత కుంటుపడుతుంది
- సంస్కరణలకు మిలిటరీ ఏమీ 'ల్యాబ్' కాదు: మాజీ నేవీ చీఫ్‌లు



సైనికులు, అగ్నివీర్‌లకు చాలా తేడాలు

అగ్నివీర్‌లు, ఇతర జవాన్‌లకు మధ్య శిక్షణ, సర్వీసు కాలం మాత్రమే కాకుండా ఇంకొన్ని కీలకమైన తేడాలు ఉన్నాయని అరుణ్ ప్రకాశ్ పేర్కొన్నారు. అగ్నివీర్‌లు అందుకునే సౌకర్యాల్లోనూ తేడా ఉందని, వీరికి ఎలాంటి ర్యాంక్ ఉండదని తెలిపారు. ఇది సాయుధ బలగాల మధ్య ఉండాల్సిన సోదరభావం, బంధంపై ప్రభావం చూపుతుందన్నారు. మరణించిన అగ్నివీర్ అజయ్ కుమార్ కుటుంబానికి అందిన రూ.98 లక్షలు ఇన్సూరెన్స్ డబ్బులేనని, ఎక్స్‌గ్రేషియా కాదని స్పష్టం చేశారు. సాధారణ జవాన్ మరణిస్తే కొన్ని వారాల్లోనే ఎక్స్‌గ్రేషియా అందుతుందని, అజయ్ కుమార్ కుటుంబానికి ఆరు నెలలుగా ఎందుకు అందలేదో అర్థం కావడం లేదన్నారు.

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న వేళ భారత నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అగ్నివీరులకు అరకొర శిక్షణ ఇస్తున్నారని, వీరు సెంట్రీ విధులకు మాత్రమే సరిపోతారని అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. అగ్నిపథ్ పథకం యుద్ధ సన్నద్ధతను తగ్గిస్తుందని, ఈ ప్రభావాన్ని గుర్తించకుండా అగ్నిపథ్‌ను అమలు చేయడం తొందరపాటు చర్య అని పేర్కొన్నారు. సంస్కరణలు చేసేందుకు మిలిటరీ ఏమీ ప్రయోగశాల కాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాణాంతక ఆయుధాలు, సంక్లిష్టమైన యంత్రాల నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలంటే ముందుగా ఎవరికైనా కనీసం ఐదారేండ్లు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అగ్నివీర్‌లకు ఇచ్చే ఆరు నెలల శిక్షణ నేవీకి సంబంధించినంత వరకు ఏమాత్రం సరిపోదని ఆయన స్పష్టం చేశారు. పదాతిదళం ఎక్కువగా ఉండే ఆర్మీకి అగ్నివీర్‌లు ఉపయోగపడొచ్చని కానీ సాంకేతికతను ఎక్కువగా వినియోగించే నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు వీరి ఉపయోగం తక్కువేనని అన్నారు. మాజీ నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ కూడా ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు. పెన్షన్ బిల్లు తగ్గించుకోవడం మాత్రమే అగ్నిపథ్ పథకాన్ని నడిపిస్తున్న ప్రేరణ అని పేర్కొన్నారు.

మొదట ఉన్న ప్రతిపాదన వేరే: నరవణే

ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే కూడా ప్రచురణ కావాల్సి ఉన్న తన పుస్తకంలో అగ్నివీర్ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అగ్నివీర్‌లను కేవలం ఆర్మీలోకి మాత్రమే తీసుకోవాలని, వీరిలో 75% మందిని పూర్తిస్థాయి విధుల్లోకి తీసుకోవాలనేది ముందు ఉన్న ప్రతిపాదన అని ఆయన రాశారు. పీఎం కార్యాలయంలో ఈ పథకంలో మార్పులు జరిగాయని, ఆ తర్వాత ఒకేసారి ఆర్మీతో పాటు నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోనూ దీనిని అమలు చేశారన్నారు. కాగా, ఈ పుస్తకం ఏప్రిల్‌లోనే ప్రచురితం కావాల్సి ఉంది. అయితే, ఇటీవల ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ పుస్తకంలోని కొన్ని విషయాలను బయటకు వెల్లడించగా, అవి వివాదాస్పదం అయ్యాయి. దీంతో పుస్తకంలోని కంటెంట్‌ను ఒకసారి సమీక్షించాలని కేంద్రం నిర్ణయించడంతో పుస్తక ప్రచురణ నిలిచిపోయింది.

మహాయుతికి 9.. ఎంవీఏకు 2

మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల వెల్లడి

ముంబై, జూలై 12: మహారాష్ట్రలో 11 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమి పోటీ చేసిన తొమ్మిది స్థానాలనూ కైవసం చేసుకుంది. బీజేపీ ఐదు స్థానాలు గెలుచుకోగా, శివసేన(షిండే) రెండు స్థానాలు, ఎన్సీపీ(అజిత్ పవార్) రెండు స్థానాలు దక్కించుకున్నాయి. ఇక, మహావికాస్ అఘాడీ మూడు స్థానాలకు పోటీ చేయగా రెండింటిని గెలుచుకుంది. శివసేన(ఉద్ధవ్) నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఒకరు గెలవగా, శరద్ పవార్ మద్దతుతో పోటీ చేసిన పీడబ్ల్యూపీ అభ్యర్థి జయంత్ పాటిల్ ఓడిపోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే ఏడుగురు కాంగ్రెస్ అభ్యర్థులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ప్రచారం జరుగుతున్నది.

జూన్ 25.. రాజ్యాంగ హత్యా దినం

ఎమర్జెన్సీపై కేంద్రప్రభుత్వం ప్రకటన



న్యూఢిల్లీ, జూలై 12: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రధానిగా ఇందిరా గాంధీ 1975, జూన్ 25న విధించిన 'ఎమర్జెన్సీ' రోజును ఇకపై 'రాజ్యాంగ హత్యా దినం'గా పాటించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమర్జెన్సీ రోజుల్లో అనేక ఇబ్బందులకు గురైన లక్షలాది మందిని స్మరించుకొనేందుకు, ఆ నియంతృత్వ ప్రభుత్వంలో పెద్దయెత్తున హింసను ఎదుర్కొంటూ దేశ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు పోరాడిన వారి స్ఫూర్తిని గౌరవించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. 'సంవిధాన్ హత్యా దివస్'ను పాటించడం వలన వ్యక్తి స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిరక్షణ జ్వాల దేశంలోని ప్రతి ఒక్క పౌరుడిలో సజీవంగా ఉంటుందని పేర్కొన్నారు. 1975, జూన్ 25న ఎమర్జెన్సీ విధింపుతో ఎలాంటి తప్పు లేకుండా లక్షలాది మందిని జైల్లో వేశారని ఆరోపించారు.


గత పదేండ్లలో అప్రకటిత ఎమర్జెన్సీ: కాంగ్రెస్

కేంద్ర ప్రభుత్వం జూన్ 25వ తేదీని 'ప్రజాస్వామ్య హత్యా దివస్'గా ప్రకటించడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత పదేండ్లుగా దేశంలో ప్రధాని మోదీ అప్రకటిత ఎమర్జెన్సీని నడుపుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. ఇటీవల 2024, జూన్ 4న విడుదలైన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో దేశ ప్రజలు మోదీకి వ్యక్తిగత, నైతిక ఓటమి ఇచ్చారని, జూన్ 4వ తేదీ చరిత్రలో 'మోదీ ముక్తి దివస్'గా నిలుస్తుందని ఎక్స్ పోస్టులో అన్నారు.

చంద్రుడిపై వేగంగా గడుస్తున్న సమయం

నాసా అధ్యయనంలో వెల్లడి

న్యూయార్క్: భూమితో పోల్చినప్పుడు చంద్రుడిపై సమయం వేగంగా గడుస్తున్నట్టు నాసా గుర్తించింది. నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ పరిశోధకులు చంద్రుడిపై సమయాన్ని అధ్యయనం చేసి.. భూమితో పోలిస్తే చంద్రుడిపై సమయం రోజుకు 0.0000575 సెకన్లు వేగంగా గడుస్తున్నట్టు తేల్చారు. చంద్రుడిపై గురుత్వాకర్షణ శక్తి తక్కువ ఉండటమే దీనికి కారణంగా భావిస్తున్నారు. ఇది చాలా చిన్న తేడానే అనిపించినప్పటికీ అంతరిక్ష ప్రయోగాలు, నావిగేషన్ వ్యవస్థలకు సంబంధించి ఈ సూక్ష్మ తేడాను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.



మూత్రాన్ని నీటిగా మార్చేసే స్పేస్‌సూట్

వ్యోమగాముల కోసం తయారుచేసిన పరిశోధకులు

న్యూయార్క్, జూలై 12: మూత్రాన్ని ఐదు నిమిషాల్లో ఫిల్టర్ చేసి నీటిగా మార్చేసే స్పేస్‌సూట్‌ను పరిశోధకులు తయారుచేశారు. వెయిల్ కార్నెల్ మెడిసిన్‌కు చెందిన సోఫియా ఎట్లిన్ ఈ స్పేస్‌సూట్‌ను తయారుచేశారు. మూత్రాన్ని సేకరించేందుకు వ్యోమగాములకు ముందు సిలికాన్‌తో చేసిన ఒక కలెక్షన్ కప్‌ను జననేంద్రియాల వద్ద ఏర్పాటుచేస్తారు. వ్యోమగామి మూత్రవిసర్జన చేయగానే ఇది మూత్రాన్ని స్పేస్‌సూట్‌లోని ఫిల్టర్ చేసే వ్యవస్థకు పంపిస్తుంది. 87 శాతం సమర్థతతో ఇది మూత్రాన్ని ఫిల్టర్ చేసి నీటిగా మారుస్తుందని 2025 నాటికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

గరళంగా భూగర్భ జలం

- 2100 నాటికి తాగడానికి పనికి రాదు
- 3.5 డిగ్రీలు పెరుగనున్న నీటి ఉష్ణోగ్రత
- విషతుల్యమైన మూలకాలతో కలుషితం
- ప్రపంచంలో 60 కోట్ల మందిపై ప్రభావం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలోని ప్రతి నలుగురిలో ఒకరి దాహార్తిని తీర్చేది భూగర్భజలమే. అలాంటి ప్రాణజలం.. రానున్న కాలంలో గరళంగా మారనున్నది. వాతావరణ మార్పులు, భూతాపం, గ్లోబల్ వార్మింగ్ వెరసి 2,100నాటికి భూగర్భజలాల ఉష్ణోగ్రతలు 3.5 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర పెరుగనున్నట్టు అంతర్జాతీయ పరిశోధకులు అంచనా వేశారు. నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుముఖం పడుతుందని పైగా ప్రమాదకరమైన క్రిములకు ఆ నీరు ఆవాసంగా మారుతుందని పేర్కొన్నారు. ఇది దాదాపు 60 కోట్ల మందిపై తీవ్ర ప్రభావం చూపించవచ్చని హెచ్చరిస్తున్నారు. ఈ వివరాలు 'నేచర్ జియోసైన్స్'లో ప్రచురితమయ్యాయి.

ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం: భూగర్భ జలాలు వేడెక్కడంతో దేశాల ఆర్థిక వ్యవస్థలపై కూడా పెను ప్రభావం పడొచ్చని అంచనా వేస్తున్నారు. రసాయనాలతో కూడిన ఈ కలుషితమైన వేడి నీరు వ్యవసాయానికి, తయారీ రంగానికి, విద్యుదుత్పత్తికి ఏమేరకు పనికొస్తుందో కూడా అనుమానమేనని చెబుతున్నారు.




'విశ్వాసం'లో ప్రచండ ఓటమి

కాఠ్మాండు, జూలై 12: నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ 'ప్రచండ' పార్లమెంట్‌లో శుక్రవారం తనపై ప్రవేశపెట్టిన విశ్వాసపరీక్షలో ఓడిపోయారు. ప్రభుత్వానికి సీపీఎన్-యూఎంఎల్ పార్టీ మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో మరోసారి కేపీ శర్మ ఓలి నేపాల్ ప్రధాని పీఠం ఎక్కనున్నారు. నేపాల్ పార్లమెంట్‌లోని ప్రతినిధుల సభలో 275 మంది సభ్యులుండగా, ప్రచండకు మద్దతుగా 63 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2022 డిసెంబర్ 25న ప్రధాని పదవిని చేపట్టిన ప్రచండ గత ఏడాదిన్నరలో నాలుగుసార్లు విశ్వాస పరీక్షను ఎదుర్కొన్నారు. సభలో అతిపెద్ద పార్టీగా ఉన్న నేపాలీ కాంగ్రెస్‌తో కలిసి కేపీ ఓలి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్నారు.

పెందలాడే భోజనం ఎంతో మేలు

- రాత్రి తొమ్మిదింటికి చేసే భోజనం.. ఆరింటికే చేస్తే ఆరోగ్యానికి మంచిది
- గుండె జబ్బులు, డయాబెటిస్ రావు
- బెంగళూరు వైద్య నిపుణుల వెల్లడి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): రాత్రి పెందలాడే భోజనం తింటే ఆరోగ్యానికి మంచిదని బెంగళూరుకు చెందిన పోర్టిస్ దవాఖాన వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రి 9 గంటలకు చేసే భోజనాన్ని సాయంత్రం ఆరింటికే పూర్తి చేయడం వల్ల గుండెపోటు, టైప్-2 డయాబెటిస్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉండదని చెబుతున్నారు.

కారణాలు ఇవి..

పనులొన్నప్పుడు శారీరక శ్రమ ఉండదు. కాబట్టి, నిద్రపోయే ముందు మితంగా ఆహారాన్ని తీసుకోవాలంటారు. ఆ ఆహారాన్ని కూడా నిద్రకు నాలుగైదు గంటల ముందుగానే తీసుకొంటే మంచిదని పరిశోధకులు చెప్తున్నారు. దీనిద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇన్సులిన్ ఉత్పత్తి క్రమబద్ధం అవుతుంది. తద్వారా టైప్ 2 డయాబెటిస్ ముప్పు ఉండదని పరిశోధకులు చెప్తున్నారు. రాత్రి తొమ్మిదింటికి బదులు సాయంత్రం ఆరింటికే భోజనం ముగిస్తే.. రక్తపోటు వంటి గుండె జీవక్రియల మీద మెరుగైన ప్రభావాన్ని చూపింది గుండెజబ్బుల ముప్పు కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు. భోజనాన్ని ముందే ముగించడంతో రాత్రిళ్లు మంచి నిద్ర పడుతుందని.. ఇది శారీరక, మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తుందని గుర్తు చేస్తున్నారు.



ఒడిశా సీఎం మాఝీకి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నైనీ కోల్‌బ్లాక్‌కు సహకరిస్తాం

- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఒడిశా సీఎం హామీ

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): ఒడిశాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైని కోల్‌బ్లాక్‌లో బొగ్గు తవ్వకాలు చేపట్టేందుకు అన్నివిధాలుగా సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలంగాణ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఇందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం ఒడిశాలో పర్యటించింది. తొలుత ఆ రాష్ట్ర సచివాలయంలో సీఎంతో భేటీ అయ్యి నైని కోల్‌బ్లాక్‌లో బొగ్గు బ్లాక్ ప్రారంభానికి, బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని కోరగా.. సీఎం మాఝీ సానుకూలంగా స్పందించారు. భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా.. వాటిని వెంటనే పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. దీంతో ఇక్కడ 3 నెలల్లోనే బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. అనంతరం భట్టి విక్రమార్క అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా భట్టి బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాసితులతోను భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. తెలంగాణ ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సంస్థ సీఎండీ బలరాం, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

కొండెక్కిన ధరలు



జూన్‌లో 5.08 శాతంగా నమోదు • ఠారెత్తిస్తున్న పప్పులు, కూరగాయల రేట్లు • ఫలించని రిజర్వ్ బ్యాంక్ చర్యలు

న్యూఢిల్లీ, జూలై 12: ద్రవ్యోల్బణం దడ పుట్టిస్తున్నది. గత నెల రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు 4 నెలల గరిష్ఠాన్ని తాకాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం జూన్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.08 శాతంగా నమోదైంది. ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉండగా.. మళ్లీ ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లో గణాంకాలున్నాయి. అంతకుముందు మేలో 12 నెలల కనిష్ఠాన్ని సూచిస్తూ 4.80 శాతంగా ఉండటం గమనార్హం. కానీ ఈసారి అది మరింత పెరిగింది. ఇక గత ఏడాది జూన్‌లో 4.87 శాతంగా ఉన్నట్టు ఎన్‌ఎస్‌వో తెలియజేసింది.

ఆర్బీఐపై ఒత్తిళ్లు

అధిక ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ తీసుకుంటున్న చర్యలు ఫలించడం లేదు. నిరుడు ఫిబ్రవరి తర్వాతి నుంచి కీలక వడ్డీరేట్లు యథాతథంగానే ఉంటున్న విషయం తెలిసిందే. జూన్‌లో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలోనూ రెపోరేటును 6.50 శాతంగానే ఉంచింది. వాస్తవానికి వివిధ రంగాలు, వ్యాపార-పారిశ్రామిక వర్గాల నుంచి వడ్డీరేట్లను తగ్గించాలన్న డిమాండ్లు వస్తున్నా.. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వాటిని ఆర్బీఐ పక్కనపెడుతున్నది. అయితే వచ్చే నెల జరిగే ద్రవ్యసమీక్షలోనైనా వడ్డీరేట్లు తగ్గుతాయన్న ఆశలపై తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు నీళ్లు చల్లాయి. ఇంకొంతకాలం ఆర్బీఐ కఠిన ద్రవ్య విధానాన్నే అనుసరించవచ్చన్న అంచనాలున్నాయి మరి. ఆర్బీఐ ఓ ఇంటర్వ్యూలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈ సంకేతాలనూ ఇచ్చారు. ఆగస్టు 6-8 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్యసమీక్ష ఉన్న సంగతి విదితమే. అలాగే ఆర్బీఐకి 4 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినది తెలిసిందే.

ఐఐపీ 5.90 శాతం

దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ ఏడాది మే నెలలో 5.90 శాతంగా నమోదైంది. ఇది 7 నెలల గరిష్ఠం. గత ఏడాది అక్టోబర్‌లో ఐఐపీ 11.9 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లో గణాంకాలున్నాయి. కాగా, విద్యుత్తు, గనుల రంగాల్లో ఉత్పాదకత పెరుగడం కలిసొచ్చిందని కేంద్ర గణాంకాలు, కార్యాచరణ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. నిరుడు మే నెలతో పోల్చితే విద్యుత్తు రంగం వృద్ధిరేటు 13.7 శాతానికి, గనుల రంగం వృద్ధి 6.6 శాతానికి పెరిగాయి. కీలకమైన తయారీ రంగం మాత్రం 6.3 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. ఇదిలావుంటే ఈ ఏడాది జనవరిలో 4.20 శాతంగా ఉన్న ఐఐపీ.. ఫిబ్రవరిలో 5.60 శాతం, మార్చిలో 5.40 శాతం, ఏప్రిల్‌లో 5 శాతంగా ఉన్నది. నిరుడు నవంబర్, డిసెంబర్లలో 2.50 శాతం, 4.40 శాతంగా ఉన్నాయి. ఇక నిరుడు మే నెలలో 5.70 శాతంగా ఐఐపీ ఉన్నట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

శాంతించని ఆహార ధరలు

ఆహార ద్రవ్యోల్బణం ఎంతకీ శాంతించడం లేదు. వరుసగా 8వ నెల కూడా 8 శాతంపైనే నమోదైంది. జూన్‌లోనైతే 9.36 శాతానికి చేరడం ఆందోళన కలిగిస్తున్నది. మే నెలలో ఇది 8.69 శాతంగా ఉన్నది. కూరగాయలు, పప్పుధాన్యాల ధరలు రెండంకెల స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. వరుసగా 29.3 శాతం, 16.1 శాతంగా ఉన్నాయి. కూరగాయల రేట్లు 10 శాతానికిపైగా ఉండటం వరుసగా ఇది 8వ నెల. పప్పుధాన్యాలకైతే 10వ నెల కావడం గమనించదగ్గ అంశం. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. ఈసారి సాగుబడిని ప్రభావితం చేస్తున్నాయి. పంటల దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చేలా కనిపించడం లేదు. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక మార్కెట్లలో ఆయా ఆహారోత్పత్తుల రేట్లు రోజురోజుకు పెరుగుతూపోతూనే ఉన్నాయి. ఉత్తర భారతంలో వానలు దంచికొడుతున్నా.. దక్షిణాదిలో మాత్రం చినుకు రాలడం లేదు.

బీఎస్‌ఎన్‌ఎల్ రూ.107 ప్లాన్

మరో చౌక టారిఫ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ

న్యూఢిల్లీ, జూలై 12: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్..మరో ప్లాన్‌ను పరిచయం చేసింది. ఒకవైపు టెలికం దిగ్గజాలు తమ ప్లాన్ల ధరలను పెంచుతూపోతుంటే..మరోవైపు బీఎస్‌ఎన్‌ఎల్ మాత్రం సామాన్యుడి లక్ష్యంగా చేసుకొని పలు ప్లాన్లను ఆవిష్కరిస్తున్నది. దీంట్లోభాగంగా 35 రోజుల కాలపరిమితితో రూ.107 కనీస రీచార్జి ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ కింద 200 నిమిషాలు ఏ నెట్‌వర్క్‌కైనా మాట్లాడుకోవచ్చును, అలాగే 3జీబీ డాటాను వినియోగించుకోవచ్చును. టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా అందిస్తున్న ప్లాన్ల కంటే ఇదే చౌకది కావడం విశేషం. ఇటీవల కాలంలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు తమ ప్లాన్ల ధరలను 25 శాతం వరకు పెంచాయి. దీంతో కస్టమర్లు ఆ నెట్‌వర్క్‌లను వదిలి తక్కువ ప్లాన్లను అందిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన నగరాల్లో 4జీ సేవలు అందిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్..వచ్చే నెల చివరినాటికి ఈ సేవలను దేశవ్యాప్తంగా విస్తరించాలనుకుంటున్నది.

- జియో రూ.189 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్‌ను అందిస్తున్నది. 28 రోజుల కాలపరిమితితో ఇదే చౌకైన ప్లాన్. అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, 2జీబీ డాటా, 300 ఎస్‌ఎంఎస్‌లు పంపుకోవచ్చును.
- ఎయిర్‌టెల్ రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్ ప్రకటించింది. 28 రోజుల కాలపరిమితితో లభించే ఈ ప్లాన్ కింద 2జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లు
- అలాగే వొడాఫోన్ ఐడియా 28 రోజుల కాలపరిమితితో రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్‌ను అందిస్తున్నది. ఈ ప్లాన్‌లో 2జీబీ డాటా, 300 ఎస్‌ఎంఎస్‌లు ఉచితంగా పంపుకోవచ్చును.



హెచ్‌సీఎల్ 600 శాతం డివిడెండ్

న్యూఢిల్లీ, జూలై 12: ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.4,257 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 20.4 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 6.6 శాతం వృద్ధితో రూ.28,057 కోట్లు ఆర్జించింది. అంచనావేసిన దానికంటే అధికంగానే ఆర్థిక ఫలితాలు నమోదయ్యాయని కంపెనీ సీఈవో సీ విజయకుమార్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి 3-5 శాతమని గైడెన్స్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.12 లేదా 600 శాతం మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.

ఆల్‌టైం హైకి సూచీలు



80,519కి సెన్సెక్స్, 24,500 అధిగమించిన నిఫ్టీ

ముంబై, జూలై 12: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. ఐటీ, టెక్నాలజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో లాభాల్లో ప్రారంభమైన సూచీలు చివరివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. దేశీయ టెక్నాలజీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకుమించి లాభాలను ప్రకటించడంతో మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. వీటికితోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉండటం కూడా సూచీలు కదం తొక్కడానికి ప్రధాన కారణంగా నిలిచాయి. రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగియడం పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 622 పాయింట్లు అందుకొని రికార్డు స్థాయి 80,519.34 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 996.17 పాయింట్లు(1.24 శాతం) లాభపడి ఆల్-టైం హై 80,893.51 వద్దకు చేరుకున్నది. మరోసూచీ నిఫ్టీ 186.20 పాయింట్లు పెరిగి 24,502.15 వద్ద స్థిరపడింది.

టీసీఎస్ షేరు దూకుడు

దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాల్లో అంచనాలకుమించి రాణించడంతో కంపెనీ షేరు ఏడు శాతం వరకు లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. 6.68 శాతం లాభపడింది. దీంతోపాటు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టెక్ మహీంద్రా షేర్లు మూడు శాతానికి పైగా లాభపడ్డాయి. అలాగే యాక్సిస్ బ్యాంక్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, ఎన్టీపీసీలు లాభాల్లో ముగిశాయి. కానీ, మారుతి, ఏషియన్ పెయింట్స్, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎయిర్‌టెల్‌లు నష్టపోయాయి.



20 నుంచి అమెజాన్ ప్రైమ్‌డే

న్యూఢిల్లీ, జూలై 12: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మళ్లీ ప్రైమ్ డే ఆఫర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ఈ నెల 20 నుంచి 21 వరకు రెండు రోజులపాటు అన్ని రకాల ఉత్పత్తులపై తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ బ్యాంకుల కార్డుల్లో బుకింగ్ చేసుకున్నవారికి 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు కంపెనీ డైరెక్టర్ కిశోర్ తెలిపారు. అలాగే ఈసారి కొత్తగా 450 బ్రాండ్లకు చెందిన వెయ్యికి పైగా కొత్త ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

సాస్ స్టార్టప్‌లకు టీ హబ్ దన్ను

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 12 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి టీ హబ్ ప్రత్యేకంగా ల్యాబ్ 32 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇప్పటి వరకు 12 సార్లు నిర్వహించిన కార్యక్రమంలో 300లకు పైగా స్టార్టప్‌లకు పూర్తిస్థాయిలో సహకారం అందించామని, తాజాగా 13వ సారి ల్యాబ్ 32 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆగస్టు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత ఎంపికైన స్టార్టప్‌లకు ఆగస్టు 27 నుంచి నవంబర్ 27 వరకు అన్ని రకాలుగా సేవలు అందించనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీలైన ఏఐ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చెయిన్‌తో మెటావర్స్, వెబ్ 3.0, ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ రంగాలకు సంబంధించిన స్టార్టప్‌లను ఎంపిక చేశామని, తాజా విడతలో కేవలం సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) స్టార్టప్‌లను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy**. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



రోజ్మేరీ.. జుట్టుకు స్ట్రాంగ్!

నల్లని, ఒత్తయిన జుట్టు కావాలని అందరికీ ఉంటుంది. కానీ నేటి ఆహారం నుంచి పీల్చేగాలి వరకు ప్రతిదీ కలుషితం కావడంతో జుట్టు ఆరోగ్యం దెబ్బతింటున్నది. పాతికేళ్లకే తెల్లజుట్టు వచ్చేస్తున్నది. కేశ సంపదను కాపాడుకోవడానికి రకరకాల నూనెలు, మాస్క్‌లు వాడుతున్నారు. అయితే రసాయనాలు కలిసిన సీరమ్‌లు, హెయిర్ డైల కంటే సహజమైన నూనెలు జుట్టు కుదుళ్లను బలంగా మారుస్తాయి. సహజ సువాసనలు వెదజల్లే రోజ్మేరీ ఆయిల్ జుట్టు సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

- రోజ్మేరీ ఆయిల్ జుట్టుకు పోషణ అందిస్తుంది. ఈ నూనెను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. వేడి చేసిన ఆలివ్ నూనెలో రోజ్మేరీ ఆకులను కాసేపు మరిగించాలి. నూనె చల్లారిన తర్వాత ఒక సీసాలోకి వడగట్టుకోవాలి. ఈ నూనెను వారానికి రెండుసార్లు జుట్టు కుదుళ్లకు పట్టిస్తే మంచి ఫలితం ఉంటుంది.
- రోజ్మేరీ ఆయిల్ జుట్టు రాలిపోవడాన్ని అరికడుతుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్ లక్షణాలు చుండ్రు, దురద వంటి సమస్యలను నివారిస్తాయి. నూనెలోని యాంటీ ఫంగల్ లక్షణాలు చుండ్రును తగ్గించి జుట్టు కుదుళ్లకు బలాన్నిస్తాయి.
- ఈ నూనెతో మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. జుట్టు ఆరోగ్యంగా, దృఢంగా మారుతుంది. జుట్టుకు సహజమైన మెరుపు వస్తుంది.
- రోజ్మేరీ ఆయిల్ మాత్రమే కాదు నీటిని కూడా జుట్టు సంరక్షణకు ఉపయోగించవచ్చు. ఓ గిన్నెలో నీళ్లు తీసుకుని దానిలో రోజ్మేరీ ఆకులు వేసి మరిగించి చల్లార్చాలి. ఈ నీటిని వడపోసి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. రాత్రి పడుకునేముందు జుట్టుపై స్ప్రే చేసుకుంటే.. మంచి గుణం కనిపిస్తుంది.



మనోబలమే బంగారం!

'మగరాయుడిలా మారిపోతున్నావ్!' స్నేహితుల ఎగతాళి. 'ఆడపిల్లవు నీకెందుకీ ఆటలు' ఇరుగు పొరుగు మాటలు. 'పెండ్లి చేసేస్తే సరి' బంధుగణం గుణం బయటపెట్టుకుంది. 'నిలువు.. గెలువు..' అని భుజం తట్టేవాళ్లు లేని నైరాశ్యంలో.. పట్టుదలే ఆమె మనోబలమైంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆ పట్టుదలకు అసలు కారణం. ఎంతటి బరువైనా అలవోకగా ఎత్తేస్తూ... ఎన్నెన్నో పతకాలు సాధించింది లంబాడా బిడ్డ తేజావత్ సుకన్యాబాయి. తాజాగా ఏషియా పసిఫిక్ ఆఫ్రికన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 76 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి అదుర్స్ అనిపించుకుంది. అంతర్జాతీయ పోటీల్లో బంగారమై మెరిసిన ఈ సింగరేణి బిడ్డ అంతరంగమిది.

మహబూబాబాద్ జిల్లాలో 'కలెక్టర్ తండా' మా ఊరు. నాన్న తేజావత్ లక్ష్మణ్ సింగరేణి ఉద్యోగి. మణుగూరు ఓసీలో ఆపరేటర్‌గా పనిచేసేవారు. అమ్మ పేరు సుభద్ర. ఇంటిపట్టునే ఉండేది. మేం ముగ్గురం ఆడపిల్లలం. మణుగూరులోనే పెరిగాం. అక్కడ హోలీ ఫ్యామిలీ స్కూల్‌లో చదివాం. నేను చదువుల్లో కాస్త వెనకబడేదాన్ని. అయినా అమ్మానాన్న బాగా చదవాలని ఎప్పుడూ ఒత్తిడి చేయలేదు. మా స్కూల్లో వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేసేదాన్ని. పోటీలు ఉండేవి కావు. మణుగూరు సింగరేణి క్లబ్‌లో వెయిట్ లిఫ్టింగ్ ఉండేది. చాలామంది ఔత్సాహికులు చేసేవాళ్లు. అక్కడ నేనూ ప్రాక్టీస్ చేసేదాన్ని. కొంతమంది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేవాళ్లు. నేనూ వాళ్లలా మెడల్స్ గెలవాలని ఆశపడేదాన్ని. 2000 సంవత్సరం సిడ్నీ ఒలింపిక్స్‌లో కరణం మల్లీశ్వరి కాంస్య పతకం గెలిచారు. అప్పుడు నేను పదో తరగతి చదువుతున్నాను. ఆమెలా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ కావాలని ఆనాడే అనుకున్నా.

ఇట్లుంటారు జనం

జర్మనీ నుంచి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తరఫున శాట్ ఎండీ దినకర్ బాబు రూ.2 లక్షలు ఇచ్చారు. ఆ డబ్బుతో కొన్ని నెలలు డైట్, సప్లిమెంట్స్ అవసరాలు తీరాయి. అప్పటికే నాన్న ఇద్దరు సిస్టర్స్‌కి పెండ్లి చేశారు. అప్పులయ్యాయి. అయినా నా ఖర్చుల కోసం నెలకు రూ.18 వేలు పంపేవారు. నా ప్రాక్టీసును ఆయన ఎప్పుడూ భారంగా భావించలేదు. కానీ, బంధువులు నాన్నకు ఫోన్ చేసి పెండ్లి చేసేయమని చెప్పేవారు. నేను ఫోన్ చేసి అమ్మానాన్నలకు నచ్చజెబుతూ ఉండేదాన్ని. కొన్నాళ్లకు వారానికి ఒకసారి అమ్మానాన్నతో మాట్లాడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేదాన్ని. నా సంగతులేం తెలియకపోవడంతో ఈ పిల్ల ఏదో చెడిపోయిందని అనుకున్నారు కొందరు. గెలుపుతోనే వాళ్లకు సమాధానం చెప్పాలని నిశ్చయించుకున్నా. 2018లో స్పెయిన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వెండి పతకం సాధించి నాపై అవాకులు చెవాకులు పేలిన వారికి సమాధానం చెప్పా.

ధైర్యమే నా బలం

పదో తరగతి తర్వాత హైదరాబాద్ వచ్చాను. మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమా (సివిల్ ఇంజినీరింగ్) చేశాను. అయితే చదువుపై ఆసక్తి లేక ఆటల్లోకి వచ్చాను. ఎప్పుడో ఒకసారి కాలేజీకి వెళ్లేదాన్ని. పొద్దున, సాయంత్రం ఎల్బీ స్టేడియంలో రన్నింగ్ ప్రాక్టీస్ చేసేదాన్ని. అక్కడ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ మీసా రాజశేఖర్ కనిపించారు. ఆయన్ని కలుసుకొని నేను ఏ ఆటలో రాణించగలనో సలహా ఇవ్వమని అడిగాను. 'నీ శరీరాకృతి వాలీబాల్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్‌కు పనికిరాదు. వెయిట్ లిఫ్టింగ్‌కి బాగా నప్పుతుంది' అన్నారు. శారీరక సౌందర్యం మీద ఆసక్తి ఉంటే.. వెయిట్ లిఫ్టింగ్‌కు సెట్ అవ్వదని అన్నారు. అందంగా ఉండాలన్న కోరిక నాకు లేదని చెప్పాను. వెయిట్ లిఫ్టింగ్ శిక్షణలో చేరతాను అనగానే ఇంట్లోవాళ్లు ఓకే చెప్పారు. ఏడాదిపాటు వెయిట్ లిఫ్టింగ్‌లో క్లీన్ అండ్ జర్క్ (మెడ నుంచి పైకి రాడ్‌ని ఎత్తడం), స్నాచ్ (కింద నుంచి పైకి ఒకేసారి లేపడం) టెక్నిక్‌లు నేర్చుకున్నాను. ఫిట్‌నెస్, బాడీబిల్డింగ్... ఏడాదంతా ఇదే. మరుసటి ఏడాది 25 కిలోల వెయిట్‌తో ప్రాక్టీస్ మొదలుపెట్టాను. తర్వాత 30, 40 కిలోలు ఇలా బరువు పెంచుకుంటూ సాధన చేశాను. మరో ఏడాది తర్వాత ఎల్బీ స్టేడియంలో డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ మీట్‌లో పోటీ పడే అవకాశం వచ్చింది. 50 కేజీల కేటగిరీలో ఫస్ట్ వచ్చాను. అదే నా మొదటి విజయం! రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఖమ్మంలో రాష్ట్ర స్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీ-2013లో గోల్డ్ మెడల్ వచ్చింది. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన నేషనల్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్‌లో నాలుగో స్థానం వచ్చింది. తర్వాత సీనియర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టాను. మరుసటి ఏడాది విజయవాడలో జాతీయ స్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాను.



గెలిస్తే ప్రశంసల్లేవ్..

రెండు రాష్ట్రాలు విడిపోయాయి. మా కోచ్ ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లిపోయారు. అప్పటికే డిప్లొమా అయిపోయింది. ఒక సబ్జెక్ట్ బ్యాక్‌లాగ్ ఉంది. చదువు సాగిపోవాలంటే జాతీయ స్థాయి పోటీలు వదులుకోవాలి. అందుకని డిప్లొమాలో మళ్లీ ఇంటర్‌లో చేరాను. తర్వాత ఇగ్నో నుంచి బీఏ పూర్తిచేశాను. ఇంట్లో పెండ్లి చేసుకోమని అనేవాళ్లు. నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. పతకం వస్తే మంచి జాబ్ వస్తుందని, కొన్ని రోజులు ఆగాలని చెప్తూ వచ్చాను. కోచ్ రాజశేఖర్ సర్ అంతర్జాతీయ క్రీడాకారుడు. నా సామర్థ్యం గురించి ఆయనకు అవగాహన ఉంది. ఆయన దగ్గరే ప్రాక్టీస్ చేయాలనుకున్నాను. ఏపీలో ఉన్న కాలేజీలో చేరడానికి నాకు అర్హత లేదు. కాబట్టి ఆ సర్ నడుపుతున్న ప్రైవేట్ అకాడమీలో చేరాను. అక్కడ ప్రాక్టీస్ చేస్తూ తెలంగాణలో జరిగే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 2017లో జర్మనీలో జరిగిన ఇంటర్నేషనల్ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాను. అందులో నాకు ఆరో స్థానం వచ్చింది. వెంటనే... ఖేలో ఇండియా గేమ్స్, ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్, నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ ఈవెంట్స్ ఆడాను. కానీ, పతకాలందరికీ జయజయధ్వానాలు పలకరని అప్పుడే తెలిసింది. తెలిసినవాళ్లు 'ఈ వెయిట్ లిఫ్టింగ్ వల్ల నీకు ఏమొస్తుంది? నువ్వు మగరాయుడు లాగా మారిపోయావ్!' అని నానా మాటలన్నారు. మరోవైపు పెండ్లి ముచ్చట మళ్లీ ముందుకు తెచ్చారు. మానసికంగా బాగా కుంగిపోయాను.



అకాడమీ నా భవిష్యత్

ఇప్పుడు వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు గెలుస్తున్నాను. లెక్కలేనన్ని పతకాలు గెలిచాను. ఇస్తాంబుల్‌లో 2023లో జరిగిన ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏడో స్థానం వచ్చింది. ఈ నెల దక్షిణాఫ్రికాలో జరిగిన ఏషియా పసిఫిక్ ఆఫ్రికన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 76 కేజీల విభాగంలో బంగారు పతకం గెలిచాను. పట్టిందల్లా బంగారం అన్నట్టుగా ఉంది నా కెరీర్. మా అమ్మానాన్న ఇప్పుడు గర్వపడుతున్నారు. ఒకప్పుడు ఈ ఆటలొద్దు అన్నవాళ్లే ఇప్పుడు పొద్దునే నాలుగు గంటలకు ఫోన్ చేసి నిద్రలేపుతున్నారు. ప్రాక్టీస్‌కి వెళ్లావా? లేదా? అని అడుగుతున్నారు. నా వల్ల మా తండాలో వెయిట్ లిఫ్టింగ్ గురించి అందరికీ తెలిసింది. ఇన్నాళ్లూ వెయిట్ లిఫ్టింగ్ టెక్నిక్‌లు తెలుసుకుంటూ, సామర్థ్యం పెంచుకుంటూపోయాను. కొన్ని క్రీడలు చాలా ఖరీదయినవి. వెయిట్ లిఫ్టింగ్‌లో పేదోళ్లు ఉంటారు. వాళ్లకు అవకాశాలు కల్పిస్తే విజేతలుగా నిలుస్తారు. క్రీడాకారిణిగా రాణిస్తూనే నాలాంటి వాళ్లను పదిమందిని తయారుచేయాలన్నదే నా లక్ష్యం.

... నాగవర్ధన్ రాయల

📷 కేశవాని మహేశ్‌గౌడ్

సందెపొద్దుల కాడ.. ఒళ్లు వంచెయ్ నరుడా!



ఈరోజుల్లో వ్యాయామం చాలామంది దినచర్యలో భాగంగా మారిపోయింది. ఆధునిక జీవనశైలి, మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల ఎదురయ్యే సమస్యల బారినపడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాల్సిందే! ఈ క్రమంలో ఉద్యోగులు, గృహిణులు, పిల్లలు, వృద్ధులు వారికి వీలైన సమయాల్లో వర్కవుట్లు చేస్తూ ఆరోగ్య ప్రయోజనాలను పొందుతున్నారు. వ్యాయామం ఎంతసేపు చేశామన్నది కాదు.. ఎప్పుడు చేశామన్నది కూడా చాలా ప్రధానం అంటున్నారు నిపుణులు. ఏ వేళలో చేసే వ్యాయామం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో తెలుసుకుందాం..

ఉదయం

చాలామంది వ్యాయామానికి ఉదయం వేళ సరైన సమయంగా భావిస్తారు. వేకువజామున చేసే వ్యాయామం జీవక్రియను ప్రేరేపిస్తుంది. రోజంతా క్యాలరీలను కరిగించే ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. సానుకూల మానసిక స్థితిని ప్రోత్సహిస్తుంది. రోజంతా ఉల్లాసంగా ఉంచుతుంది. అయితే ఉదయం వేళ కండరాలు వేడెక్కడానికి ఎక్కువ సమయం పడుతుంది. వ్యాయామం సరిగా చేయకుంటే గాయాల ముప్పు పొంచి ఉంటుంది. బిజీ షెడ్యూల్స్ ఉన్నవారికి, వర్కవుట్స్ కోసం ఉదయాన్నే సమయాన్ని వెచ్చించడం సమస్యగా మారుతుంది.

మధ్యాహ్నం

శరీర ఉష్ణోగ్రత, కండరాల కార్యకలాపాలు మధ్యాహ్నం అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ సమయంలో వ్యాయామం అవయవాల పనితీరును మెరుగుపరుస్తుంది. పగటిపూట వ్యాయామం ఒంటరిగా కాకుండా స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. కానీ, అరగంట సేపు, అర్ధగంట సేపు పూర్తయ్యాక ఏదో నాలుగు నిమిషాలు వర్కవుట్లు చేస్తామంటే కుదరదు. పని ఒత్తిడి కారణంగా వాయిదాపడే అవకాశం ఉంది.

సాయంత్రం

సాయంకాలం చేసే వ్యాయామం ఒత్తిడిని తగ్గించడంలో సాయపడుతుంది. పొద్దంతా పనిచేశాక సాయంత్రం ఓ ఇరవై నిమిషాలు వర్కవుట్లు చేస్తే శరీరం కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంటుంది. శరీర ఉష్ణోగ్రత, కండరాల కార్యకలాపాలు పెరిగే సమయంలో వ్యాయామం చేయడం వల్ల ఫలితం మెరుగ్గా ఉంటుంది. అయితే సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్యలో మాత్రమే వ్యాయామానికి సమయం కేటాయించాలి. నిద్రకు ఉపక్రమించే ముందు వ్యాయామం చేయకూడదు. ఇది అడ్రినలిన్ స్థాయిలను పెంచడం వల్ల నిద్రలేమి సమస్యకు దారి తీయొచ్చు.

పెరుగుకూ సీనుంది!



ఇప్పుడంతా ఇన్‌స్టాగ్రామ్ యుగం. అందులో అందంగా కనిపిస్తేనే, ఉత్పత్తి నలుగురినీ ఆకట్టుకునే అవకాశం ఉంటుంది. దుస్తులు, యాక్సెసరీస్‌లోనే కాదు ఫుడ్ విషయంలోనూ ఇదే ఫ్యాషన్ అయిపోయింది. అందుకే ఆహారాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు తమ క్రియేటివిటీ అంతటినీ వినియోగిస్తున్నారు తయారీదారులు. అవీ ఇవీ అని కాదు, చివరికి పెరుగు తోబుట్టువు అయిన యోగర్ట్‌నూ ఇలాగే ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. ఇక్కడి గ్లాసుల్లో నీలిరంగు తెలుపు నిండిన పదార్థం యోగర్ట్. పండ్ల ముక్కలు, గింజలు, కొన్ని రకాల జావుల్ని కలిపి వీటిని ఇలా నీలిరంగు ఆకాశంలా రూపొందిస్తున్నది చైనాకు చెందిన బ్లాన్గ్ అనే ఆహారోత్పత్తి సంస్థ. ఇందులోని రంగుల కోసం అవకాడో, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీలాంటి రకరకాల పండ్లను వాడుతున్నది. చూస్తుంటే తమకిష్టమైన విండోస్ వాల్ పేపర్‌లా ఉందని, దాన్ని చటుక్కున తాగేసే అవకాశం ఇది అనీ... నెటిజన్లు స్పందిస్తున్నారు. ప్రోబయాటిక్‌గా పనికొస్తూ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచేందుకు సాయపడే యోగర్ట్‌కి ఇప్పుడు అభిమానులు పెరిగిపోవడంతో, వారిని ఆకట్టుకోవడానికి తాము ఇలా నింగిని పోలిన అలంకారం చేస్తున్నామని సదరు సంస్థ చెబుతున్నది. ఆరోగ్యం - అందం ఒకే గ్లాసులో ఉన్నాయన్నమాట!

అమ్మతనం వరం. దాన్ని అందుకోవాలని ప్రతి ఇల్లాలూ కోరుకుంటుంది. నాన్నగా పిల్లలను లాలించాలని పురుషుడూ భావిస్తుంటాడు. అందుకోసం ఆలుమగలు నోములు నోస్తారు. మొక్కులు కడుతుంటారు. అయితే, ఆధునిక జీవనశైలి, ఒత్తిళ్లు, ఉద్యోగ బాధ్యతలు ఈ తరం దంపతులకు గండాల్లా పరిణమిస్తున్నాయి. గర్భధారణ ఆలస్యం కావడానికి కారణాలు తెలిస్తే.. వాటిని పరిష్కరించుకునే మార్గాలు అన్వేషించొచ్చు. జీవనశైలిలో మార్పులు చేసుకోకపోతే.. సంతానయోగం అందని ద్రాక్షగా మిగిలిపోవచ్చు.

సంతాన యోగం ఆలస్యం!



ఉద్యోగం, వ్యాపారం, దైనందిన జీవితంలో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. దీని కారణంగా స్త్రీలలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని అధ్యయనాల్లో వెల్లడైంది. ఒత్తిడి ప్రభావం మహిళల కన్నా పురుషులపై ఎక్కువగా ఉంటుందట. ఈ ప్రభావం వారి దాంపత్య జీవితం మీదా పడుతుంది.

సంతానోత్పత్తి వయసుతోపాటు మారుతుంది. వయసు పెరిగే కొద్దీ అండాల పరిమాణం, సామర్థ్యం తగ్గుతాయి. దీంతో గర్భధారణ కష్టమవుతుంది. 40 ఏండ్లు పైబడిన తర్వాత పురుషుల్లో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గుతుంది.

హార్మోన్ల అసమతుల్యత కూడా స్త్రీ, పురుషులపై ప్రభావం చూపుతుంది. వయసు పెరిగే కొద్దీ శృంగార జీవితంపై ఆసక్తి తగ్గుతూ వస్తుంది. దీంతో భార్యాభర్తలు సరైన సమయంలో కలవలేకపోతుంటారు. ఫలితంగా గర్భధారణ ఆలస్యమవుతుంది.

అనారోగ్యమైన జీవనశైలి కూడా సంతానోత్పత్తిని దెబ్బతీస్తుందని పలు అధ్యయనాల్లో తేటతెల్లమైంది. పోషకాలు లేని ఆహారం, కల్తీ పదార్థాలు, నిద్రలేమి, శారీరక శ్రమ... వీటన్నిటినీ సంతానోత్పత్తికి గండాలుగానే పరిగణించాలి. వీటిని అధిగమించినప్పుడే ఆలుమగలు అమ్మానాన్నలయ్యేది!

అల్లంతో అలసటకు చెక్!

మనం రోజువారీ వంటల్లో వాడే పదార్థాల్లో ఒకటి అల్లం. కూరలు, గ్రేవీల్లోనే కాకుండా స్నాక్స్, చాయ్‌లోనూ మంచి ఫ్లేవర్ కోసం దీన్ని వాడతారు. ఇక వర్షాకాలంలో తరచూ పలకరించే జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలకు అల్లం చాయ్, అల్లం పాలతో చెక్ పెట్టేయొచ్చు. అల్లంలో మన శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రొటీన్స్ లభిస్తాయి. అయితే, అల్లాన్ని కూరల్లో భాగంగా తీసుకుంటే ఫలితం పరిమితంగానే ఉంటుందట. పరగడుపున చిన్న ముక్కలు తీసుకుంటే అధిక ప్రయోజనాలు ఉంటాయని నిపుణుల మాట. ఉదయాన్నే ఒక టీ స్పూన్ అల్లం రసం తీసుకున్నా.. మంచి ఫలితం వస్తుందట. ఇలా చేస్తే రోజంతా హుషారుగా ఉంటారట. ఉదయాన్నే అరఅంగుళం అల్లం ముక్కను, తేనెతో తీసుకుంటే.. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. ఫలితంగా గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలు దూరమవుతాయి. క్రమం తప్పకుండా అల్లం తీసుకోవడం వల్ల కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. నోటి దుర్వాసన కూడా పారిపోతుంది. రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు దగ్గు, జలుబు లాంటి సీజనల్ వ్యాధులు పీడించకుండా అల్లం అడ్డుగా నిలుస్తుంది.

